
శతకీర్తి





నింగిలోకి పయనమవుతున్న రాకెట్ మొదటి దశ - రెండో దశ - మూడో దశ - రాకెట్ నుంచి విడిపోయి కక్ష్యలోకి చేరుతున్న నావిక్-02 ఉపగ్రహం

తిరుపతి జిల్లా శ్రీహరికోట నుంచి వందవ రాకెట్ విజయవంతంగా రోదసిలోకి దూసుకుపోవడంతో షార్ ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతోంది. ఒకప్పుడు బయటి ప్రపంచాన్ని ఎరుగని ఏనాదులు జీవించే ఒక మారుమూల దీవి, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షించిన అంతరిక్ష ప్రయోగ కేంద్రంగా మారిన పరిణామాలను ఈ ప్రాంతపు వాసులు గుర్తు చేసుకుంటున్నారు. తొలి రోజుల్లో షార్ అభివృద్ధిలో భాగం అయిన శాస్త్రవేత్తలు, ఇతర ఉద్యోగులు వందో విజయ సందర్భంలో సంబరపడుతున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి బుధవారం ఉదయం 6.23 గంటలకు తెలిమంచు తెరలను చీల్చుకుంటూ జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోయింది. ఈ దృశ్యాన్ని ఈ ప్రాంత ప్రజలంతా ఇళ్ల బయటకు వచ్చి ఆనందంతో వీక్షించారు. పొగ చారలు ఆకాశంలో మిగిల్చి అంతరిక్షంలోకి నావిగేషన్ ఉపగ్రహం నావిక్-02 ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి వందవ రాకెట్ చేర్చడంతో షార్ శాస్త్రవేత్తలు ఆలింగనాలూ, కరచాలనాలతో అభినందలు తెలుపుకున్నారు. ఈ విజయం షార్ భవిష్యత్తుకు కూడా కీలకం కానుంది. మూడవ లాంచ్ ప్యాడ్ నిర్మాణ నిర్ణయంతో, గత కొన్నేళ్లుగా స్తబ్దుగా మారిన శ్రీహరికోటలో మళ్లీ సందడి నెలకొననుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి ఐదువేల మందిదాగా బుధవారం శ్రీహరికోటకు తరలివచ్చారు. మంచు కురుస్తున్నా చలిని సైతం లెక్కచేయకుండా గ్యాలరీలో కూర్చున్నారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు వాహనాలు తెల్లవారుజామునుంచే బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో చప్పట్లు, ఈలలు, కేరింతలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

విద్యార్థులతో కలిసి వీక్షించిన కలెక్టర్

సూళ్లూరుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాకెట్ ప్రయోగాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ దంపతులు, ఆర్డీవో కిరణ్మయి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి వీక్షించారు. సైన్సు ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.హిమ, అన్విని లకు కూడా కలెక్టర్‌తో పాటు మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలో ఉన్న 500 మంది విద్యార్థులకు రాకెట్ ప్రయోగాన్ని విజిటర్స్ గ్యాలరీ నుంచి వీక్షించే అవకాశం కల్పించారు.



మిషన కంట్రోలర్ సెంటర్‌లో ఇస్రో చైర్మన్ నారాయణన్, షార్ డైరెక్టర్ రాజరాజన్‌తో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కనే ఆర్డీవో కిరణ్మయి, విద్యార్థులు



రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న ఇస్రో మాజీ చైర్మన్లు



మంచు తెరలు చీల్చుకుంటూ..
నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లిన వందో రాకెట్

రాకెట్ వీక్షణకు మాజీ ఇస్రో చైర్మన్‌లు..

షార్ వేదికగా జరిగిన వందో రాకెట్ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు డాక్టర్ ఎస్.సోమనాథ్, డాక్టర్ కె.రాధాకృష్ణ, శివన్, ఏఎస్.కిరణ్ కుమార్ శ్రీహరికోటకు వచ్చారు. వీరితో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు. వందో ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో చైర్మన్ ప్రకటించగానే ఆనందోత్సాహాలు ప్రకటించారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడండి

- జీవకోనలో పర్యటించిన కమిషనర్ మౌర్య
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో వినతులకు స్పందన



మరమ్మతులకు గురైన బోరును పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి (జీవకోన), జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ జీవకోన ప్రాంతంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' నినాదంతో ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం జీవకోన ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానంగా నీటి సమస్యను స్థానికులు ప్రస్తావించారు. మరిన్ని సమస్యలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో బుధవారం 48, 49 డివిజన్లలో కమిషనరు మౌర్య పర్యటించారు. ప్రతి వీధి తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. పలుచోట్ల నీటి సమస్య అధికంగా ఉందని, మరింత మెరుగ్గా పారిశుధ్యం పనులు చేపట్టాలని స్థానికులతో పాటు కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ కోరారు. పలు సమస్యలను ప్రస్తావించారు. కాగా, ప్రధానమైన నీటి సమస్యను అధిగమించేందుకు తక్షణమే బోర్లు, మోటార్ల మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు కమిషనరు మౌర్య సూచించారు. మురుగునీటి కాలువలకూ మరమ్మతులు, లేనిచోట్ల పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చాలని, తడి పొడిచెత్త వేర్వేరుగా ఇచ్చేలా చూడాలని, బహిరంగ మూత్ర విసర్జన చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కాగా, దెబ్బతిన్న డ్రైన్ల స్థానంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టాలని కమిషనరును కలిసి మాజీ సర్పంచి అన్నా రామకృష్ణ కోరారు. బోర్లను మరమ్మతులుచేస్తే నీటి సమస్యను కొంత మేర అధిగమించవచ్చని సూచించారు. మరిన్ని సమస్యలను ఆయన ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, అధికారులు రవి, ఏసీపీ బాలాజీ, సర్వేయర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానాల పరిశీలన

సమస్యల పరిష్కార వేదికలో స్థానికుల నుంచి వచ్చిన వినతి మేరకు రాజీవ్ గాంధీ కాలనీ వద్ద ఉన్న శ్మశాన వాటికలను కమిషనర్ పరిశీలించారు. శ్మశానాలను శుభ్రంగా ఉంచాలన్నారు. గేటు ఏర్పాటు చేసి ఆకతాయిలు రాకుండా చర్యలు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు.



మొదలైన రోడ్డు పనులు

తిరుమల బైపాస్‌రోడ్డు నుంచి సత్యనారాయణపురం సర్కిల్‌కు వెళ్లే విరజా మార్గం.. వంద మీటర్ల వరకు అసంపూర్తి ఉంది. దీనివల్ల ప్రజలుపడే ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై కమిషనర్ మౌర్య స్పందిస్తూ మిట్ట ప్రాంతం వద్ద సిమెంటు రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. పనులూ ప్రారంభించారు.

తండ్రి వెంటే వెళుతూ..!

- స్వర్ణముఖి వాగులో పడి బాలుడి మృతి
- ఈ విషయం తెలియక పోలీసులకు ఫిర్యాదు
- వాగులో కనిపించిన మృతదేహం





తేజ (ఫైల్ ఫొటో) - ఒడిలో బిడ్డ మృతదేహం పెట్టుకుని రోదిస్తున్న తల్లి

చంద్రగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బుడిబుడి అడుగులేస్తూ తండ్రి వెనక వెళ్లాడో మూడేళ్ల బాలుడు. ఆ విషయం తండ్రికి తెలియదు. స్వర్ణముఖి వాగు దాటే క్రమంలో బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ విషాద ఘటన బుధవారం చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ పాతపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాతపేటకు చెందిన లోకేశ్, శరణ్యదంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారులు. బుధవారం తై అమాస్య కావడంతో.. చనిపోయిన తన తండ్రి రంగాచారికి ఉదయం 11 గంటల సమయంలో లోకేశ్, కుటుంబీకులు ఇంట్లో బట్టలు పెట్టారు. ఆ తర్వాత తన తండ్రి గుంత(సమాధి) వద్దకు లోకేశ్ వెళ్లారు. ఇంటి దగ్గర ఆడుకొంటున్న చిన్న కుమారుడు తేజ(3) తండ్రి వెనకాలే వెళ్లిపోయాడు. ఇది గమనించని లోకేశ్.. స్వర్ణముఖి వాగు దాటుకొని తండ్రి గుంత వద్దకు వెళ్లి.. తిరిగి ఇంటికొచ్చారు. తేజ కనిపించకపోవడంతో గాలించారు. అనంతరం పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో జాతీయ రహదారిలో గాలింపు చర్యలు చేపట్టారు. గాందంకి టోల్‌ప్లాజా వద్ద సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అనుమానంతో దామలచెరువు వరకు వాహనాలు తనిఖీ చేశారు. స్వర్ణముఖి వాగులో బాలుడి మృతదేహాన్ని గుర్తించిన పశువుల కాపరులు గ్రామస్తులకు సమాచారమిచ్చారు. తమ కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చంద్రగిరి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పద్మావతి వర్సిటీ దూర విద్యకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలోని దూరవిద్యా కేంద్రం నిర్వహించే పలు కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఎంఏ సంగీతం, తెలుగు, ఎంకాం, మ్యూజిక్‌లో డిప్లొమో వంటి కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 31 నుంచీ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు ఫిబ్రవరి 5వ తేదీ చివరి గడువు. ఫిబ్రవరి 7 నుంచీ 12 వ తేదీ దాకా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్ కానీ, 0877-2284524 లేదా 8121787415 నెంబర్లలో సంప్రదించాలని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని తెలిపారు.

జిల్లాలో తగ్గుముఖం

- నేడు ప్రపంచ కుష్ఠు నివారణ దినోత్సవం



కుష్ఠుపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తిరుపతి(వైద్యం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠు వ్యాధి కేసులు తగ్గుముఖం పట్టాయి. దీనిపై ప్రజల్లో కొంత అవగాహన పెరగడం.. సకాలంలో వైద్యం అందడంతో కేసులు తగ్గాయి. జిల్లాలో మొత్తం 901 మంది కుష్ఠుతో బాధపడుతున్నారు. వీరిలో 123 కేసులు ఏడాదికాలంలో నిర్వహించిన సర్వేలో వైద్య సిబ్బంది గుర్తించినవి. వీరిలో 48 మంది వ్యాధి తక్కువ(మొదటి దశలో) ఉండగా, 75 మంది పూర్తి లక్షణాలతో ఉన్నట్లు తేలింది. 14 ఏళ్లలోపు ఉన్న 14 మంది చిన్నారుల్లోనూ కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్నట్లు ఇటీవల గుర్తించారు. ఎక్కువగా వరదయ్యపాళెం, పిచ్చాటూరు, నారాయణవనం, నాగలాపురం, బుచ్చినాయుడకండ్రిగ, చిన్నపాండూరు వంటి మారుమూల ప్రాంతాల్లోనే ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు. దీంతో అక్కడ నిరంతరం సర్వే చేస్తూ, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ కొత్త కేసులు నమోదు కాకుండా చర్యలు చేపడుతున్నారు.

ప్రభుత్వ వైద్యం, సాయం

2027 నాటికి ఒక్క కొత్త కేసు కూడా నమోదు కాకూడదనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. కుష్ఠు లక్షణాలున్న వారిని సర్వేలో గురిస్తే ప్రభుత్వ వైద్యశాలల్లో మందులు, చికిత్స అందిస్తున్నారు. వేళ్ల వంకర్లు తిరిగిన వారిని పలమనేరు, నెల్లూరు, తమిళనాడులోని కనిగిరిలో ఉన్న ప్రత్యేక ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం అందిస్తున్నారు. దీనికయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించడంతో పాటు సాయంగా రూ.12 వేలనూ అందిస్తోంది. అవసరమైన వారికి ఏడాదికి రెండు జతల ఎంసీఆర్ చెప్పులూ ఇస్తోంది. కుష్ఠు వల్ల అంగవైకల్యం బారిన పడిన 732 మందికి ప్రతి నెలా రూ.6 వేల పింఛను ఇస్తోంది. వచ్చే ఏడాదికి ఒక్క కొత్త కేసు కూడా నమోదు కాకూడదనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

ఏకలవ్య ఆదర్శ గురుకుల నిర్మాణానికి
అదనంగా రూ.1.93 కోట్లు

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీఎన్ కండ్రిగలో ఏకలవ్య ఆదర్శ గురుకుల భవనాల నిర్మాణ అంచనాలను గిరిజన సంక్షేమశాఖ సవరించింది. 2015లో రూ.12 కోట్లు మంజూరు చేయగా, హైదరాబాదుకు చెందిన ఓ సంస్థ 16.16 శాతం తక్కువ మొత్తంతో పనులు దక్కించుకుంది. పనులు పూర్తయ్యాక నిధులు చాలక బిల్లులు పెండింగులో పడ్డాయి. దీంతో లెస్ టెండర్ల ద్వారా ఆదా అయిన రూ.1.93 కోట్లను ఇప్పుడు అదనంగా మంజూరు చేయాల్సి వచ్చింది.

'సూపర్ సిక్స్' అమలవుతుంది

- కలిసి కట్టుగా రాక్షసపార్టీ ఉనికి లేకుండా చేద్దాం
- 'కూటమి' నేతలు, శ్రేణులకు మంత్రి సత్యకుమార్ పిలుపు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేస్తుందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పష్టంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో వెంటిలేటర్‌పైకి చేరిన రాష్ట్రానికి.. ఏడు నెలలుగా కూటమి ప్రభుత్వం ఆక్సిజన్ అందించి నడిపిస్తోందన్నారు. తిరుపతిలో బుధవారం జరిగిన బీజేపీ జిల్లా అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సంకీర్ణ ధర్మాన్ని పాటిస్తూ మన బలాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికల్లో కూటమికి 57 శాతం.. వైసీపీకి 39 శాతం వచ్చాయని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో ఆ 39 శాతాన్ని మనం కైవసం చేసుకునేలా కూటమి పార్టీలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలు వేరైనా ఒక్కటిగా పనిచేస్తూ రాబోయే ఎన్నికల్లో రాక్షస పార్టీ ఉనికి లేకుండా చేద్దామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి బాట ఎక్కించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ ఏడు నెలల్లో పోలవరానికి కేంద్రం రూ.12వేల కోట్లు ఇచ్చింది. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో రాజధాని నిర్మాణం ఊపందుకుంది. సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రణాళికమేరకు కేంద్రం రూ.15 వేల కోట్లను రాజధానికి అందజేసింది. ప్రపంచం అబ్బురపడే రాజధాని ఎన్డీయే కాలంలోనే సాకారమవుతుంది' అని మంత్రి తెలిపారు. ఇన్ని పనులు శరవేగంగా జరుగుతుంటే.. పెన్షన్ పెంపు, ఉచిత సిలిండర్లు ఇస్తుంటే.. ఇవన్నీ మర్చిపోయి కొందరు సూపర్ సిక్స్ అంటున్నారన్నారు. అవీ అమలవుతాయని స్పష్టంచేశారు. ఈ విషయంలో మన నాయకులు, కార్యకర్తలే మన ప్రభుత్వాన్ని విమర్శిస్తుండటం సరికాదన్నారు. 'రాష్ట్రానికి చికిత్స జరుగుతోంది. త్వరలో అన్నీ చక్కబడతాయి. కూటమి కార్యకర్తలు, అభిమానులు కాస్తంత సంయమనం పాటించాలి' అని కోరారు.

రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే



ఎర్రావారిపాలెం, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రావారిపాలెం క్రాస్ నుంచి ఎల్లమందకు రూ.5 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. క్రాస్ నుంచి చెరుకువారిపల్లె వరకు 2 కిలోమీటర్ల మేర సీసీ డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం వల్ల రాయచోటికి 17 కిలోమీటర్లు దూరం తగ్గుతుందన్నారు. 40 గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఆర్అండ్‌బీ రోడ్డును విస్తరిస్తున్నామని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కాగా, మండల కేంద్రంలోని శ్రీశక్తి భవన్‌లో తలకోన సిద్ధేశ్వర స్వామి శివరాత్రి బహోత్సవాల ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్షించారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని సూచించారు.

ఏపీ హంస వార్షిక క్యాలెండరు ఆవిష్కరణ



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి(వైద్యం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) ఉమ్మడి చిత్తూరు జిల్లా వార్షిక క్యాలెండరును వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవిష్కరించారు. బుధవారం తిరుపతికి వచ్చిన ఆయన్ను ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా కలిసి వైద్య సిబ్బంది సమస్యల పరిష్కారం దిశగా ఏపీ హంస చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం క్యాలెండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు టాటాబాయి, ఇమ్రాన్, శ్రీనివాస్, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగమణి, పక్కనే శాస్త్రవేత్తలు రాగూర్, వజంత

తిరుపతి రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చెరకు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని పెరుమాళ్లపల్లెలోని వ్యవసాయ పరిశోధనా స్థానం హెడ్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్వీ సరళ తెలిపారు. ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలో నడిచే వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో బుధవారం రైతులకు చెరకులో మేలైన యాజమాన్యంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయపురం, కార్వేటినగరం, పాలసముద్రం ప్రాంతాల్లో చెరుకుపంట సాగుచేసే రైతులు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మంచి విత్తన రకాన్ని ఎంపిక చేసుకుని సాగు చేయడం ద్వారా పంచదార శాతంతోపాటు అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రాగూర్, డాక్టర్ నాగమణి, డాక్టర్ వజంత మాట్లాడుతూ విత్తనాన్ని జంటసాళ్ల పద్ధతిలో విత్తుకోవడం వల్ల పంట మొత్తానికి కలుపు మందులు సులభంగా వేయవచ్చని, యంత్రాల ద్వారా పంట నూర్పిడి(కొట్టుకోవచ్చు) చేయవచ్చని సూచించారు. పశువులపేడ, వర్మికంపోస్ట్‌తోపాటు రసాయన ఎరువుల మిశ్రమాన్ని తప్పనిసరిగా వేసుకోవాలని తెలిపారు.

ప్రణాళికతో గొప్ప విజయాలు



ట్రోఫీ అందజేస్తున్న ఆనందరెడ్డి, శేషారెడ్డి, ధనంజయరెడ్డి

తిరుపతి రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ప్రణాళికలు రూపొందించుకుని ఆచరించడం ద్వారా భవిష్యత్‌లో గొప్ప విజయాలను సునాయాసంగా సాధించవచ్చని బీఎస్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ బి.శేషారెడ్డి, సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ వై.ఆనందరెడ్డి తెలిపారు. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో బుధవారం ఎస్వీసైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ, సహస్రాస్ విజ్ఞాన్ జూనియర్ కళాశాలల మూడవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గౌరవ అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కళాశాల దశ నుంచి లక్ష్యాలు నిర్దేశించుకుని సాధనకు ప్రణాళికలు ఆచరించాలని సూచించారు. ఎస్వీసైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ విద్యాసంస్థ డైరెక్టర్ జి.ధనంజయరెడ్డి మాట్లాడారు. వివిధ అంశాలలో ప్రతిభచాటిన విద్యార్థులకు మెడల్స్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సత్యకుమార్ యాదవ్, సామంచిలకు అభినందన



తిరుపతి రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు వచ్చిన వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సామంచి శ్రీనివాస్‌ని బుధవారం అంబే ఢ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. వీరిద్దరూ తమ కళాశాల పూర్వవిద్యార్థులు కావడం చాలా సంతోషంగా ఉందని అభినందించారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరిలో యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న అధికారులు

భాకరాపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగుచేసే వరి పైరులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారిణి ధనలక్ష్మి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు, దిగువూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరి పైరు నాటడానికి చేసే దుక్కులు, నారు నాటేటప్పుడు వేయాల్సిన ఎరువులు, తెగులు సోకకుండా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, ఈ-పంట నమోదుపై అవగాహన కల్పించారు. అనంతరం వరి, వేరుశెనగ, ఉలవ పంటలను పరిశీలించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఐ రాఘవేంద్ర

భాకరాపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని భాకరాపేట ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. భాకరాపేట పోలీసు స్టేషన్ పరిధిలో దీన్‌దార్లపల్లె, మిట్టగాండ్లపల్లె కుంట దగ్గర బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి విచ్చలవిడిగా ఖాళీ సీసాలు వేసి ఉండడం గుర్తించి ఆ ప్రదేశాలను పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

చెక్ బౌన్సు కేసులో ఏడాది జైలు శిక్ష

తిరుపతి(నేరవిభాగం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్సు కేసులో నిందితునికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి కొర్లగుంటకు చెందిన ప్రదీప్ రేణిగుంట రోడ్డులో కాపురమున్న శ్యాంసుందర్ వద్ద 2020లో రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 2022లో ప్రదీప్ వడ్డీతో కలిపి రూ.5 లక్షలకు చెక్ ఇచ్చాడు. శ్యాంసుందర్ చెక్కును బ్యాంకులో జమ చేశాడు. ప్రదీప్ అకౌంటులో అవసరమైన డబ్బులు లేకపోవడంతో చెక్కు బౌన్సు అయింది. న్యాయస్థానంలో కేసు దాఖలు చేయగా విచారణ చేసిన న్యాయమూర్తి ప్రదీప్‌కు ఏడాది పాటు జైలు శిక్ష విధించారు. దీంతోపాటు రూ.5 లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

రూ.1.12 లక్షలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం పోలీసులు ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.1.20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి వివరాల మేరకు.. బ్యాంకు ఎంప్లాయీస్ కాలనీలోని ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడులు చేయగా పులివెందుల బి.గోవర్ధన రెడ్డి, కొర్లగుంట శివకుమార్, నెల్లూరు జయరాంనాయక్, రాజంపేట ప్రదీప్‌కుమార్, చిత్తూరు జి.హరిప్రసాద్, యాదమరి సురేష్ రెడ్డి, పూతలపట్టుకు చెందిన వాసుదేవ రెడ్డి పట్టుబడ్డారు. రూ.1.12 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి సమాచారం అందినా తమకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

దారి సమస్యకు పరిష్కారం

- కేబీఆర్ నగర్‌కు వంతెన మంజూరు
- వేగంగా నిర్మాణ పనులు



వంతెన నిర్మాణ పనుల్లో కార్మికులు

తిరుపతి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మంగళంలోని తిరుమలనగర్ గ్రామ సచివాలయ పరిధిలో గల కేబీఆర్ నగర్‌కు ఎట్టకేలకు వంతెన మంజూరైంది. కరకంబాడీ రోడ్డు ప్రధాన రహదారి నుంచి దక్షిణం వైపున 15ఏళ్ల క్రితం డ్రైవర్స్ క్వార్టర్స్‌గా చిన్నగ్రామం ఏర్పడింది. 50 నివాసాలున్న ఆ ప్రాంతాన్ని ప్రస్తుతం కేబీఆర్‌నగర్‌గా పిలుస్తున్నారు. చెన్నాయగుంట చెరువు నుంచి వచ్చే మొరవనీరు ఈ కాలనీకి ముందు ప్రవహిస్తుంది. తాత్కాలిక కల్వర్టు ఏర్పాటు చేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ మొరవనీరు ఉధృతంగా ప్రవహించడంతో కల్వర్టు కొట్టుకుపోతోంది. గత ప్రభుత్వంలో దీని గురించి పట్టించుకున్న పాపానపోలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి మళ్లీ కల్వర్టు కొట్టుకుపోవడంతో నివాసాల మీదుగా వరదనీరు ప్రవహించింది. తాత్కాలిక ఏర్పాట్లు చేస్తుండడంతో స్థానికులు అడ్డుకుని శాశ్వత వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే నాని ఆ ప్రాంతంలో పర్యటించినప్పుడు ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఈ క్రమంలో ఆయన రూ.10లక్షలు మండల, రూ.9.45లక్షలు వరద ప్రభావిత నిధులతో వంతెన నిర్మాణం మంజూరు చేయించారు. వారం క్రితం ప్రారంభమైన పనులు వేగంగా సాగుతున్నాయి. నెల రోజుల్లో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేనున్నారు.

వేమూరును సందర్శించిన సుభాష్ పాలేకర్



తిరుచానూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సుభాష్‌పాలేకర్ సందర్శించారు. భూలక్ష్మి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారులతో సమావేశమయ్యారు. వారికి విష రహిత వ్యవసాయ ఉత్పత్తులను పండించడంపై వివరించారు. మనం తీసుకునే ఆహారం ఔషధం కావాలంటే ఎస్‌పీకే విధానాలను ప్రతి ఒక్క రైతూ అనుసరించాలన్నారు. పెరటి, మిద్దె తోటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గంగాధరం, మాస్టర్ రాంజీ, ప్రకృతి వ్యవసాయ ఆదర్శ రైతు అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.

మహిళా భవనం స్థలాన్ని కాపాడండి



చంద్రగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగుడుపల్లెలో మహిళా భవనానికి కేటాయించిన స్థలం ఆక్రమణకు గురవుతోందని, దాన్ని కాపాడాలని సర్పంచ్ ధర్మారెడ్డి కుమారుడు క్రాంతికుమార్ బుధవారం తహసీల్దార్ శివరామసుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో మహిళలు సమావేశం నిర్వహించడానికి ఎక్కడా ప్రభుత్వ స్థలాలు లేవని, సర్వే నెంబర్ 334-4లో 0.7 సెంట్లు ఉందని, ఈ భూమిని అదే గ్రామానికి చెందిన పక్క పొలందారుడు కబ్జా చేయడానికి పందిర వేశాడని తెలిపారు. గతంలో ఇదే స్థలం కబ్జాకు గురైతే అప్పటి రెవెన్యూ అధికారులు తొలగించి, పంచాయతీకి అప్పగించారని చెప్పారు. స్పందించిన తహసీల్దార్ శివరామసుబ్బయ్య ఆక్రమణలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూపసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

మైమరపించిన దాసపదాల సంకీర్తనాగానం



తిరుమల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనం బుధవారం సాయంత్రం పురందరదాసు కీర్తనలతో మార్మోగింది. పురందరదాసు ఆరాధన మహోత్సవాల్లో రెండో రోజున ఉభయదేవేరులతో కలిసి శ్రీవారు నారాయణగిరి ఉద్యానవనానికి వేంచేపు చేశారు. దాస సంకీర్తనలు, నృత్యాల నడుమ ఉత్సవర్లకు ఉయ్యాలసేవ కనువిందుగా సాగించింది. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దాస భక్తులు సామూహికంగా పురందరదాస కృతులను ఆలపించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, అధికారులు, 3,500మందికి పైగా ఏపీ, తెలంగాణ, కర్ణాటకకు చెందిన భజన మండళ్లు పాల్గొన్నాయి.

మీరుచేసిన అపచారాలు గుర్తుకురావా?

- టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ



తిరుపతి అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 'మీ హయాంలో చేసిన అపచారాలు గుర్తుకురావా? ఇప్పుడు నీతులు మాట్లాడడం మంచి పద్ధతి కాదు' అని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి మాజీ బోర్డు సభ్యుడు ఓ.వి.రమణ సూచించారు. బుధవారం ఆయన తన నివాసం మీడియాతో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆరుగురు భక్తులు మృతి చెందడంతో అపచారం చోటుచేసుకుందని, దేవస్థానం ప్రతిష్ఠ మరింత దిగజారిందని భూమన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 'చెలికత్తెలను తీసుకెళ్లి ఆలయంలో గంటల కొద్దీ కూర్చున్నావు. సామూహిక కల్యాణోత్సం సందర్భంగా రైల్వేస్టేషన్ వద్ద బిక్షగాళ్లను తీసుకొచ్చి వివాహం చేశావు. లెక్కాపక్క లేకుండా దేవుడి సొమ్ము ఖర్చుపెట్టావు. పరకామణి బయటకు తేవడం, మహాలఘు దర్శనం, హుండీ కానుకలను విచ్చలవిడిగా ఖర్చుచేయడంలో జరిగిన అపచారాలు జ్ఞప్తికి రాలేదా' అని విమర్శించారు. అనాలోచిత, అహంభావ నిర్ణయాలతో ఓ అధికారి కుటుంబం ఏమైందో అందరికీ తెలుసన్నారు. నోటికొచ్చినట్టు మాట్లాడడం మానేసి సలహాలు ఇవ్వాలని సూచించారు.

రేపు తిరుపతిలో రైల్వే జీఎం పర్యటన

తిరుపతి (సెంట్రల్), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్ కుమార్ జైన్ గురువారం సాయంత్రం సికింద్రాబాద్‌లో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి శుక్రవారం ఉదయం రేణిగుంటకు చేరుకుంటారు. అక్కడ నుంచి తిరుపతికి చేరుకొని రైల్వే స్టేషన్ పరిశీలిస్తారు.

రోటరీ కృషితోనే తగ్గిన పోలియో కేసులు : మంత్రి



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

తిరుచానూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ కృషితో ప్రపంచ వ్యాప్తంగా పోలియో కేసులు 99శాతం తగ్గాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. తిరుచానూరులోని శిల్పారామంలో బుధవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన జ్ఞానక్రియ సమ్మేళనం 41వ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోటరీ ద్వారా అనేక ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ప్రతి ఒక్కరిలో మంచి చెడు అనే గుణాలు ఉంటాయని, వాటిలో మంచినే వాడాలని సూచించారు. మనం దేశం మొదట, పార్టీ తరువాత, నేను చివర అనే సిద్ధాంతంతో ముందుకు వెళ్లాలన్నారు. దేశం కోసం ప్రతి ఒక్కరూ ఆలోచించినప్పుడే దేశం బాగుంటుందన్నారు. రోటరీ జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన ప్రొద్దుటూరుకు చెందిన సాధు గోపాలకృష్ణకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ, కర్ణాటకకు చెందిన రోటరీ సభ్యులు పాల్గొన్నారు.



గౌతు శిరీష



విష్ణుప్రియ, సీత



రఘు

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎమ్మెల్యే గౌతు శిరీష, సినీ నటులు రఘు, విష్ణుప్రియ, సీత ఉన్నారు.

మొదటి ఘాట్‌లో అదుపుతప్పిన కారు

- నలుగురు భక్తులకు స్వల్పగాయాలు

తిరుమల, జనవరి29(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌రోడ్డులో బుధవారం ఓ కారు అదుపతప్పి పిట్టగోడను ఢీకొంది. ఈప్రమాదంలో నలుగురు భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. మంగళవారం తిరుమలకు వచ్చిన తమిళనాడులోని శ్రీరంగంకు చెందిన దేవానందన్ కుటుంబం బుధ వారం ఉదయం తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో ఏడోమైలు వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి కుడివైపునున్న గోడను ఢీకొంది. అదృష్టవశాత్తు కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగ్రాతులను తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

జాతీయ రహదారి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహన్

చంద్రగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పనపాకం వద్ద అసంపూర్తిగా ఉన్న పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారి నిర్మాణ పనులను బుధవారం సాయంత్రం తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ పరిశీలించారు. భూములు ఇచ్చిన బాధితు లకు నష్ట పరిహారం చెల్లించాలని అధికారు లను ఆదేశించారు. బాధితుల సమస్యలను పరిష్కరించి, రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. చంద్రగిరి ఇంది రమ్మ కాలనీ వద్ద సర్వే నెంబర్ 1513-8లో ఉన్న 0.47 సెంట్ల ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సర్వేయర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరి అరెస్టు

నెల్లూరు(క్రైం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను నెల్లూరు నగర డీఎస్పీ సింధుప్రియ బుధవారం మీడియాకు వివరించారు. 'తిరుపతి జిల్లాకి చెందిన ఓ బాలిక నగరంలోని సంతపేట పరిధిలో 8వ తరగతి చదువుతూ దగ్గర్లోని హాస్టల్‌లో ఉంటోంది. ఆ బాలిక ఈనెల 25న సాయంత్రం తిరిగి హాస్టల్‌కు రాకపోవడంతో వార్డెన్ తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారు 26న నెల్లూరుకు చేరుకొని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాలిక ఆత్మకూరు బస్టాండు వద్ద కనిపించడంతో పోలీసులు రక్షించారు. ఏమి జరిగిందని ఆరా తీయగా ఇద్దరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారని తెలిపింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్చి నిందితుల కోసం గాలించారు. కాగా, బాలిక ఇంటి నుంచి.. పాఠశాలకు వచ్చి వెళ్లే క్రమంలో సైదాపురం మండలం గిద్దలూరుకు చెందిన నిరంజన్ ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ఆమెకు పరిచయమయ్యాడు. బాలికతో చనువుగా ఉండేవాడు. ఈ నెల 25న సాయంత్రం నిరంజన్ ఆ బాలికను తీసుకుని సౌత్‌రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ అసభ్యకరంగా ప్రవర్తించడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అతడు పరారయ్యాడు. అదే సమయంలో బీవీనగర్‌కి చెందిన పృథ్వీ ఉరఫ్ రాజేష్ ఆ బాలికను హాస్టల్ వద్ద వదిలి పెడతానని చెప్పి అదే రోజు రాత్రి తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. 26న రాత్రి ఆత్మకూరు బస్టాండు వద్ద వదిలి పెట్టి, తర్వాత వచ్చి తీసుకెళతానని రాజేష్ చెప్పి వెళ్లాడు. బాలిక బస్టాండులో ఏడుస్తూ కన్పించడాన్ని గమనించిన పోలీసులు ఓదార్చి సంతపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఏమి జరిగిందని ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించగా ఇద్దరు వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తించారని చెప్పడంతో మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్చి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా బుధవారం మొదటి నిందితుడు నిరంజన్‌ను సుబేదారుపేట వద్ద, రెండో నిందితుడు రాజేష్‌ను బీవీనగర్‌లోని అతని ఇంటి వద్ద పోలీసులు అరెస్టు చేశారు' అని డీఎస్పీ వివరించారు.

పోలీసు అధికారుల సంఘం భూ ఆక్రమణ

- టీటీడీ విశ్రాంత అధికారి, ఆయన అనుచరులపై కేసు

తిరుపతి (నేరవిభాగం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారుల సంఘానికి ప్రభుత్వం కేటాయించిన భూమిపై హైకోర్టులో కేసు నడుస్తున్నా.. అనుచరులతో కలిసి టీటీడీ విశ్రాంత అధికారి ఆక్రమణకు యత్నించారు. దీనిపై తిరుపతి రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీ సర్వే నెంబరు 1-2ఏలో 4.46 ఎకరాలను పోలీసు అధికారుల సంఘానికి 1986లో ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమిపై పోలీసు అధికారుల సంఘానికి పూర్తి హక్కులున్నాయి. అయితే ఈ భూమి తనదంటూ గంగుల మునెయ్య 2024లో హైకోర్టులో కేసు దాఖలు చేశారు. రెండు వారాల పాటు న్యాయస్థానం అతనికి ఇంటీరియం ఆర్డర్ ఇచ్చింది. ఈ క్రమంలో ఈ స్థలాన్ని కాజేయడానికి టీటీడీ రిటైర్డు సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి, అతడి అనుచరులు కొందరు పథకం పన్నారు. దీంతో మంగళవారం దౌర్జన్యంగా భూమిలోకి ప్రవేశించారు. ప్రహరీని ధ్వంసం చేసి భూమిని చదును చేశారు. దీనిపై వీఆర్వో శ్రీనివాసమూర్తి తిరుపతి రూరల్ పోలీసులకు బుధవారం సమాచారం ఇచ్చారు. ఆ మేరకు సీఐ చిన్నగోవిందు తమ సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అంతలోనే వారు ఎక్స్‌కవేటర్ సహా అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. జరిగిన ఘటనపై పోలీసు హౌస్ బిల్డింగ్ సొసైటీ రిటైర్డు ఎస్‌ఐ చౌలేశ్వరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గజలక్ష్మీ నమోస్తుతే



తిరుచానూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు బుధవారం రాత్రి గజవాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాడను పురస్కరించుకుని అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తికి నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. రాత్రి గజవాహన సేవ సందర్భంగా భక్తులు అమ్మవారికి నారీకేళ, కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పురందరదాసు ఆరాధనా మహోత్సవాలు



పురందరదాసు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఆనందతీర్థాచార్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పురందరదాసు ఆరాధనా మహోత్సవాలను టీటీడీ చేపట్టింది. ఇందులో భాగంగా అలిపిరిలోని పురందరదాసు విగ్రహానికి టీటీడీ దాస ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు తదితరులు బుధవారం పుష్పాంజలి ఘటించారు. అంతకు ముందు భజన మండళ్లు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

డాక్టరేట్ ప్రదానం



నివేదిత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ అప్లైడ్ మైక్రో బయాలజీ స్కాలర్ డి.నివేదిత డాక్టరేట్ పొందారు. ఇన్వెస్టిగేషన్ ఆన్ ద యాంటీ డయాబెటిక్ అండ్ యాంటీ ఆక్సి డెంట్ యాక్టివిటీస్ ఆఫ్ ఆండ్రోగ్రాఫిక్స్ స్పెషీస్ అంశంపై ప్రొఫెసర్లు ఉమామహేశ్వరీదేవి, ప్రొఫెసర్ సురేష్‌కుమార్ సంయుక్త పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినట్లు వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని తెలిపారు.

మంగళం డిపోకు ప్రహరీ పనుల ప్రారంభం


ప్రహరీ గోడ నిర్మాణ పనులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రూ.12.5లక్షలతో మంగళం డిపో ప్రహరీ గోడ నిర్మాణ పనులు మొదలయ్యాయి. 2023లో కురిసిన భారీ వర్షానికి డిపో ప్రహరీ గోడ కూలిపోయింది. భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తుతుండడంతో పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. ఇందుకు యాజమాన్యం అనుమతిస్తూ రూ.12.5 లక్షలు మంజూరు చేసింది. మూడు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి.

ట్రెండ్స్ పాఠశాలకు పరికరాల వితరణ


పాఠశాలకు దాతల వితరణ చేసిన ఆర్వో ప్లాంటు

తిరుపతి అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మంగళం జిల్లా పరిషత్ ఉన్నత ట్రెండ్స్ పాఠశాలకు ఐడీబీఐ సీనియర్ రీజనల్ హెడ్ ఆర్.సాయికృష్ణ ఆధ్వర్యంలో రూ.80వేలు విలువచేసే శుద్ధజల తయారీ యంత్రం, సైన్స్ ప్రయోగాల నిర్వహణ కోసం రూ.70వేలు విలువచేసే ల్యాబ్ పరికరాలను వితరణ చేశారు. తిరుపతి బ్రాంచ్ హెడ్ టి.శ్రీనివాస్, మేనేజర్ డి.రాజేష్, శ్రీకాళహస్తి బ్రాంచ్ హెడ్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు. హెచ్ఎం కేశవులనాయుడు, ఉపాధ్యాయులు బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక బస్సులు నడపరా?

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా ప్రారంభమై 16 రోజులు కావస్తున్నా జిల్లా నుంచి ఆర్టీసీ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఒక్క బస్సు కూడా నడపకపోవడం విమర్శలకు తావిస్తోంది. టీటీడీ ఉద్యోగులు మహాకుంభమేళాకు వెళ్లేందుకు బస్సులు సమకూర్చిన ఆర్టీసీ సామాన్యుల విషయంలో నిర్లక్ష్యం చూపుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బస్సులను డిపోలో ఖాళీగా ఉంచడం కంటే కుంభమేళాకు తిప్పితే ఎంతో కొంత ఆదాయం వస్తుంది కదా అన్న చర్చ జరుగుతోంది. ఈ అవకాశాన్ని ప్రైవేటు ట్రావెల్స్ వారు వినియోగించుకుని, ఆదాయం పొందుతున్నారు. వచ్చేనెల 26వ తేదీ వరకు అవకాశం ఉండడంతో ఆర్టీసీ, పర్యాటక యంత్రాంగాలు తక్షణమే స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న తులసేంద్ర

తిరుపతి(ఆటోనగర్), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పాలక కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులతో ఎక్కువ పని గంటలు చేయిస్తున్నారని, వేతనాల్లో కోత విధిస్తున్నారని తెలిపారు. వారికి బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో వచ్చేనెల మూడవ వారంలో సమ్మె చేస్తామన్నారు. అనంతరం అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, విశ్వనాథం, తులసేంద్ర, దొరస్వామి, మదన్ మోహన్, గురప్ప, అరుణ పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ మహాసభను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 29(ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఆటోవర్కర్స్ యూనియన్ 11వ నగర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ కోరారు. ఫిబ్రవరి 25న నిర్వహించనున్న మహాసభ కరపత్రాలను బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు.

దివ్యాంగులు, వృద్ధులకు రాస్ సేవలు భేష్


దివ్యాంగులు, వృద్ధులతో మాట్లాడుతున్న సూర్యకుమారి

తిరుపతిత(ఆటోనగర్), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు, వయో వృద్ధులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి కొనియాడారు. బుధవారం రాస్ ప్రధాన కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలను సందర్శించారు. వారికి అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకుని, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఏవి శ్రీనివాస్, ప్రాజెక్టు డైరెక్టర్ యువరాజుల నాయుడు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నిర్వహించనున్న సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర కోరారు. ఈ మేరకు చంద్రగిరిలో బుధవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రేపు నూతన డీఈ కార్యాలయం ప్రారంభం


డీఈ కార్యాలయం

తిరుపతి(ఆటోనగర్), జనవరి 28(ఆంధ్రజ్యోతి): పాత తిరుచానూరు రోడ్డులోని డీఈ కార్యాలయ ప్రాంగణంలో సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఏడాది క్రితం నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఇటీవలే పూర్తిచేశారు. ఈ భవనంలో కార్పొరేట్ స్థాయిలో తిరుపతి టౌన్, రూరల్ డీఈ కార్యాలయాలను నిర్వహిస్తారు.

నర్సుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ నర్సులు

తిరుపతి(వైద్యం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ నర్సుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. బుధవారం తిరుపతిలో ప్రైవేటు ఆస్పత్రి ప్రారంభానికి వచ్చిన మంత్రికి ఈ మేరకు వినతిపత్రం అందించారు. పీహెచ్‌సీల్లో నర్సుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో గ్రేడ్-2 నర్సులకు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ అసోసియేషన్ నేతలు సుభాషిణి, శివమ్మ, పద్మావతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో మోసం

తిరుపతి(వైద్యం), జనవరి 29(ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్ విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెంటనే హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు గోపాల్‌రెడ్డి, కిరణ్, బాబ్జీ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నార్త్ సెక్షన్‌లోని 11 కేవీ పాలిటెక్నిక్ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కపిలతీర్థం రోడ్డు, వరదరాజనగర్, టీటీడీ వసతి గృహాల సమీపంలోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఎనిమిది మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ జరిమానా విధించారు. వారిని బుధవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.80వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ నడిరోడ్లపై వ్యాపారం చేస్తున్న 40 మందికి రూ.500 చొప్పున రూ.20వేలు జరిమానా విధించారు.

అసాంఘిక శక్తులపై పోలీసుల ఉక్కుపాదం

ఆకతాయిలు, వ్యభిచార నిర్వాహకుల కట్టడికి చర్యలు - రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండులలో పోలీసుల గస్తీ



శ్రీదేవి కాంప్లెక్సులో మద్యపానం చేసే ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న పోలీసులు - ఆర్టీసీ బస్టాండు వద్ద పోలీసుల గస్తీ

తిరుపతి (నేరవిభాగం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసాంఘిక శక్తుల కట్టడికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు నూతన ఎస్పీ హర్షవర్ధన రాజు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. ముందుగా ఆకతాయిలు బహిరంగ మద్యపానం చేసే ప్రాంతాలపై దృష్టి సారించారు. తిరుపతి ఈస్ట్, వెస్ట్, వర్సిటీ, అలిపిరి స్టేషన్లతో పాటు తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, రేణిగుంట స్టేషన్లలో 24 ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయిస్తున్నారు. మంగళవారం ఈస్ట్ స్టేషన్ పరిధిలోని శ్రీదేవి కాంప్లెక్సులో మందు బాబులకు అడ్డాగా ఉన్న ఉన్న ఖాళీ స్థలంలో డీఎస్పీ శ్రీలత, సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది కలసి గుట్టలుగా పడి ఉన్న మందుబాటిళ్లు, తినుబండారాల వ్యర్థాలు, పగిలిన బాటిళ్లను తొలగించి, శుభ్రం చేయించారు. ఆ స్థలం గేటుకు తాళం వేశారు. స్పెషల్ పార్టీ పోలీసులను నియమించి, బహిరంగ మద్యపానం కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌లో గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టడం, వ్యభిచార నిర్వాహకులను అదుపు చేయడం కోసం రెండు రక్షక్ మొబైల్ వాహనాలు ఏర్పాటు చేశారు. ప్రతి చోటా ఒక ఎస్ఐ, ఐదుగురు కానిస్టేబుళ్లతో నిరంతర గస్తీ ఉండే విధంగా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో రౌడీలు, జేబు దొంగలు, వ్యభిచార ముఠాలను అరికట్టేందుకు ఆర్టీసీ అధికారులతో కలసి బస్టాండు లోపల, బయట, చుట్టుపక్కల దాదాపు మూడు కిలోమీటర్లు రేడియస్‌తో సీసీ కెమెరాలు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనికి సంబంధించి రెండు రోజులుగా పోలీసులు, ఆర్టీసీ అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. త్వరలోనే సీసీ కెమెరాలు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయనున్నారు.

ఏపీ హంస క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ-హంస) వార్షిక క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా, నేతలు టాటాబాయి, ఇమ్రాన్, గిరి, శ్రీనివాస్, వెంకటసుబ్బమ్మ, రాజేష్, సురేంద్ర, మైనంపాటి మునిరాజా, పద్మజ, శాంతకుమార్, స్వర్ణలత, గంగమ్మ, జయలక్ష్మి, జ్యోతిలక్ష్మి, ముకేష్, నరేష్ పాల్గొన్నారు.

జాగ్వార్ బాత్ అండ్ లైటింగ్ షోరూం ప్రారంభం



తిరుపతి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి- రేణిగుంట ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన జాగ్వార్ అండ్ లైటింగ్ షోరూంను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్, సూర్య ఇంటర్నేషనల్ అధినేత డాక్టర్ పెండ్యాల హరినాథ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జాగ్వార్ బ్రాంచ్ హెడ్ అభిజిత్‌సింగ్,సాయికృష్ణ, విజయకుమార్, కిరణ్‌పటేల్, ముకేశ్‌పటేల్, మహేష్, గిరిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న కలెక్టరేట్ సెల్లార్



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 29(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సెల్లార్ భవనం పెచ్చులూడుతుండటంతో రాళ్లు మీద పడుతున్నాయి. బుధవారం ఉదయం ఓ ఉద్యోగి సెల్లార్‌లో వాహనం పార్కు చేసి నడిచి వెళుతుండుగా పెచ్చులూడి పడింది. ఆ ఉద్యోగి తృటిలో తప్పించుకున్నారు. టీటీడీ యంత్రాంగం స్పందించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

21 నుంచి టెక్‌ఫెస్ట్


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పద్మావతీ మహిళా యూనివర్సిటీలో ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు టెక్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ఉమ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యానికి రూ.86 కోట్లు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి(వైద్యం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలను అందించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో రూ.86 కోట్ల నిధులను మంజూరు చేసిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతి రూరల్ పరిధిలోని అవిలాలలో నూతనంగా నిర్మించిన సమత ఆయుర్వేద ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం మనకు పూర్వీకులు ఇచ్చిన వరమన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఆయుర్వేద వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో ఆయుష్ శాఖకు కేవలం రూ.33 కోట్లు మాత్రమే విడుదల చేసిందని వెల్లడించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఆస్పత్రిలో కేవలం పట్టణ ప్రాంతవాసులకే కాకుండా గ్రామీణులకు కూడా సేవలు అందించాలని ఆస్పత్రి నిర్వాహకురాలు సమత ప్రకాష్‌కు సూచించారు. ఆయుర్వేద గార్డెన్ అభివృద్ధికి సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వధర్మపీఠం అధ్యక్షుడు సోంప్రకాష్, మాజీ మంత్రి పరసారత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ శుభం బన్సల్, రాజారెడ్డి, విశ్వనాథరెడ్డి

తిరుపతి (జీవకోన), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను బుధవారం జేసీ శుభం బన్సల్ ఆవిష్కరించారు. వినియోగదారులు మోసపోకుండా ఉండేందుకు తీసుకొచ్చిన వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం చాలా విశిష్టమైందని సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి అన్నారు. కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, వినియోగదారుల సంఘం ప్రతినిధులు దేవేంద్ర, చంద్రిక పాల్గొన్నారు.

వైద్యుల కొరతను పరిష్కరించండి

● మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఎమ్మెల్యే నాని వినతి


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గం ఎర్రావారిపాళెం పీహెచ్‌సీలో వైద్యుల కొరత తీర్చాలని, గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన డాక్టర్లను నియమించాలనిచంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రిని ఎమ్మెల్యే కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

హాస్టల్ కార్మికుల ఆందోళన


ఆందోళన చేస్తున్న హాస్టల్ కార్మికులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్వీయూలో కార్మికులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ మద్దతు తెల్పింది. హాస్టల్ ఎన్ఎంఆర్‌లను టైంస్కేల్ వర్తింపజేయాలని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ కోరారు. దీనిపై అధికారులు స్పందించకపోతే 15 రోజుల్లో సమ్మెకు దిగుతామన్నారు. కార్యక్రమంలో రాజా, రవి, రాజశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

వేటూరికి ఘన నివాళి


వేటూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో వేటూరి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి నివాళి అర్పించారు. సినిమా పాటల ద్వారా వేటూరి గొప్ప సాహిత్యాన్ని అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేఎన్ రాజా, సుబ్రమణ్యం, చంద్రబాబు, రాఘవేంద్రాచారి, వాసు, గురుప్రసాద్, చెంగ్రాయులు, పీరా, రహీం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సిపాయికి పలువురి శుభాకాంక్షలు



అన్నదానం చేస్తున్న డాక్టర్ శ్రీహరిరావు - కేక్ కట్ చేస్తున్న రష్ ఆస్పత్రి సిబ్బంది

తిరుపతి(వైద్యం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం జన్మదిన వేడుకలను రష్ ఆస్పత్రి ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దగ్గుమాటి శ్రీహరిరావు ఆస్పత్రి ముందు 200 మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సిపాయి మౌనరెడ్డి, మేనేజరు మహేష్, సిబ్బంది రోజా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విరిసినదీ.. వసంత గానం..!

ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో ఆహ్లాదం పంచుతుంది - పూసిన వసంత రాణి పూలు



ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో విరిసిన వసంత రాణి పూలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యూనివర్సిటీలు, కాలేజీల్లోని చెట్లు అందరికీ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలోని వసంత రాణి చెట్లు పూలు పూసింది. రోజీ ట్రంపెట్ చెట్టుగా పిలువబడే ఈ చెట్టు టబూబియా రోసాయి కుటుంబానికి చెందింది. అమెరికా ఖండాంతరంలో పుష్పించే చెట్టుగా దీనికి గుర్తింపు ఉంది. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో పుష్పించడం దీని ప్రత్యేకత. పూలు పూసిన సమయంలో చెట్టు ఆకులు రాలడం గమనార్హం. ఈ పుష్ప విన్యాసం పింక్ రంగులో గుత్తులు గుత్తులుగా ఉండి విద్యార్థులు, ఉద్యోగులు, సందర్శకులందరినీ ఆకట్టుకుంటున్నాయి. పుష్పగుచ్ఛంలా అందంగా కనిపిస్తూ అందరికీ ఆహ్లాదాన్ని కలుగజేస్తున్నాయి. ఇది పూర్తి సూర్యకాంతి శక్తితోనే పెరిగే చెట్టు అని వృక్ష శాస్త్రవేత్త డాక్టర్ మిట్టా మహేంద్రనాథ్ అన్నారు. తక్కువ నీరున్న నేలలోనే ఏపుగా పెరగడం ఈ చెట్టు విశేషం. ఇందువల్లనే ఎక్కువగా నగర సుందరీకరణలోనూ, ప్రధాన రహదారుల్లోనూ, ఉద్యానవనాల్లోనూ పెంచేందుకు ఆసక్తి చూపుతుంటారు. కొందరు విద్యార్థులు ఈ చెట్ల కింద నిలబడి సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది.



భరద్వాజతీర్థానికి స్వామి అమ్మవార్ల వేంచేపు

శాస్త్రోక్తంగా తై అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో బుధవారం తై అమావాస్య ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం చప్పరాలపై అధిష్ఠింపజేసి భరద్వాజతీర్థంలోని శివాలయం వద్దకు వేంచేపు చేశారు. అక్కడ స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను తిరిగి ఊరేగింపుగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి తీసుకువచ్చారు. పూజలు నిర్వహించాక ఉత్సవర్లను పట్టణంలో ఊరేగించారు.ఆలయ ఈవో బాపిరెడ్డి, బొజ్జల బృందమ్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





స్వామి అమ్మవార్లకు నిర్వహిస్తున్న అభిషేకం.. హాజరైన భక్తులు

సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 4 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.78 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,310

తలనీలాలు సమర్పించినవారు: 17,310



100 షార్ మైలు రాళ్ళు



పులికాట్ సరస్సుకూ, బంగాళాఖాతానికీ నడుమ ఉండే శ్రీహరికోట ఒకప్పుడు చిన్నదీవి. అడవి మీద ఆధారపడి నాగరిక ప్రపంచం ఎరుగని ఏనాదులు ఉండేవారు. వ్యవసాయం చేసుకుంటూ తూర్పు రెడ్లు చిన్న చిన్న ఊళ్లుగా ఉండేవారు. 1970ల నుంచీ ఈ దీవి రూపు రేఖలు మారిపోయాయి. సూళ్లూరుపేట నుంచి పులికాట్‌ను చీలుస్తూ రోడ్డు వేయడంతో ప్రధాన భూభాగంతో కలిసిపోయింది. 1969లో రాకెట్‌ల ప్రయోగానికి అనువైన ప్రదేశం అని శ్రీహరికోటను గుర్తించిన తర్వాత నిర్మాణాలు పెరిగాయి. ప్రయోగాల వేదికగా అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. సైకిల్ మీద రాకెట్‌లను మోసుకొచ్చి ప్రయోగించిన దశ నుంచి అంతరిక్షంలో ఏకంగా ఒకశాశ్వత ప్రయోగశాలనే నిర్మించే దిశగా జరుగుతున్న పరిణామాలకు ప్రధాన కేంద్రంగా శ్రీహరికోట మారింది. అవసరాలకు అనుగుణంగా రాకెట్లను రూపొందించుకుంటూ వందవ రాకెట్‌ను బుధవారం నింగిలోకి సగర్వంగా శ్రీహరికోట ఎగరేసింది. ఈ సందర్భంగా వంద రాకెట్ల విశేషాల సమాహారం...

- కథనం - సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి)



చిన్న ప్రయోగాలతో ప్రారంభం.. నేడు భారీ ప్రయోగాలు


ఎస్‌ఎల్వీ-డీ 1తో శ్రీకారం

1979 ఆగస్టు 19న తొలిసారిగా ఎస్‌ఎల్వీ-డీ1 పేరుతో 40 కిలోల బరువు కలిగిన రోహిణి-1 ఉపగ్రహాన్ని షార్ నుంచి రోదసీలోకి పంపారు. అతి తక్కువ బరువు కలిగిన ఈ ఉపగ్రహాన్ని భూమికి దగ్గరగా ఉన్న లియో అర్బిట్‌లోకి పంపించారు. ఈ సిరీస్‌లో 1983 వరకు ఐదేళ్లలో మొత్తం నాలుగు ప్రయోగాలు చేపట్టారు. అనంతం 1980 జూలై 18న 35 కిలోల ఆర్‌ఎస్-1 ఉపగ్రహం, 1981 మే 31న 38 కిలోల బరువుగల ఆర్‌ఎస్-డీ1 ఉపగ్రహం, 1983 ఏప్రిల్ 17న 41.5 కిలోల బరువు గల ఆర్‌ఎస్-డీ2 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపారు.

రెండో రాకెట్... ఏఎస్‌ఎల్వీ

1987 మార్చి 24న ఏఎస్‌ఎల్వీ-డీ1 పేరుతో 150 కిలోల బరువు గల స్రాస్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. 100 కిలోల బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు రెండో దశలో రూపొందించుకున్న రాకెట్ ఇది. 1987 నుంచి 1994 మధ్యలో ఈ సిరీస్‌లో మొత్తం నాలుగు ప్రయోగాలు చేపట్టారు. రెండు దశల ఘన ఇంధనం వినియోగించే రాకెట్ ఇది.





ఇస్రో విజయ కెరటం పీఎస్‌ఎల్వీ

1993 సెప్టెంబరు 20న పీఎస్‌ఎల్వీ-డీ1 రాకెట్ తొలి ప్రయోగం విఫలమైంది. అయితే 1994 అక్టోబరు 15న 804 కిలోల బరువుతో ఐఆర్‌ఎస్-పీ2 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. ఆ తర్వాత ఈ రాకెట్ విజయ రికార్డులను నెలకొల్పుకుంటూ వెళ్తోంది. తక్కువ బరువు కలిగిన విదేశీ ఉపగ్రహాలు కూడా పీఎస్‌ఎల్వీల ద్వారానే ప్రయోగించారు. చంద్రయాన్-1, ఐఆర్‌ఎన్‌ఎస్ వంటి సిరీస్ ప్రయోగాలు దీని ద్వారానే అంతరిక్షంలోకి పంపారు. ఇప్పటి వరకు ఈ సరీస్‌లో 62 ప్రయోగాలు చేపట్టారు. రెండు ప్రయోగాలు మినహా మిగిలినవన్నీ విజయవంతం అయ్యాయి. ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశ పెట్టిన అద్భుత రాకెట్ ఇది.

- 1993 నుంచి 2003 వరకు పదేళ్లలో పీఎస్‌ఎల్వీ ప్రయోగాలు 8.
- 2004 నుంచి 2014 వరకు 21 ప్రయోగాలు
- 2015 నుంచి 2004 చివరి వరకు 33 ప్రయోగాలు



భవిష్యత్‌లో..

గగన్‌యాన్ మిషన్ ప్రయోగం, చంద్రయాన్-4 వంటి భారీ ప్రయోగాల పై దృష్టిసారించారు. షార్‌లో రెండు ప్రయోగ వేదికలు, నాలుగు అనుసంధాన భవనాలు, ఎంఎస్‌టీ టవర్ వసతులు ఉన్నాయి. మూడో లాంచ్‌ప్యాడ్ అత్యంత అధునాతన వసతులతో నిర్మించేందుకు ఈ ఏడాదే భూమిపూజ చేయనున్నారు. ఈ లాంచ్ ప్యాడ్‌ను రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా నిర్మాణం చేపట్టనున్నారు. దీని ద్వారా ఏకంగా 20 నుంచి 30 టన్నుల బరువు గల భారీ ఉపగ్రహాలను ప్రయోగించవచ్చుని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



కమ్యూనికేషన్ కోసం జీఎస్‌ఎల్వీ

2001లో ఏప్రిల్ 18న జీఎస్‌ఎల్వీ-డీ1 రాకెట్ ద్వారా 2 వేల కిలోల బరువు కలిగిన జీశాట్-1 ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. అత్యంత బరువు గల కమ్యూనికేషన్ ఉపగ్రహాలను పంపేందుకు ఇస్రో ఈ రాకెట్‌కు రూపకల్పన చేసింది. ఈ రాకెట్‌లో క్రయోజనిక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తొలుత రష్యా నుంచి పొందినా, తర్వాత పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే వీటిని ప్రయోగిస్తున్నారు. ఈ సిరీస్‌లో మొత్తం 17 ప్రయోగాలు చేపట్టగా నాలుగు మాత్రమే విఫలం చెందాయి.



భారీ ఉపగ్రహాల కోసం ఎల్‌వీఎం3..

2014 డిసెంబరు 18న తొలిసారిగా ఈ ఎల్‌వీఎం3 ద్వారా క్రూ మాడ్యూల్ రీ ఎంట్రీ విజయవంతంగా చేపట్టారు. అనంతరం 2017 జూలై 5న ఎల్‌వీఎం3-డీ1 ద్వారా జీశాట్-19 కమ్యూనికేషన్ రంగానికి చెందిన ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. 2014 నుంచి 2023 వరకు ఈ సిరీస్‌లో మొత్తం 7 ప్రయోగాలు చేపట్టగా 7 విజయం చెందాయి. ఈ వాహక నౌక ద్వారానే చంద్రయాన్-1, చంద్రయాన్-3 ఉపగ్రహాలు పంపారు. నాలుగు నుంచి 5 టన్నుల బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు ఎల్‌వీఎం3 వాహక నౌక రూపొందించారు.

బుల్లి వాటి కోసం ఎస్‌ఎస్‌ఎల్వీ

2022 ఆగస్టు-07న ఎస్‌ఎస్‌ఎల్వీ రాకెట్ ద్వారా ఈవోఎస్-02 ఉపగ్రహం పంపారు. ఇవి విఫలం చెందింది. అనంతరం వివిధ పరీక్షలు నిర్వహించి తిరిగి 2023 ఫిబ్రవరి 10న ఈవోఎస్07 ఉపగ్రహాన్ని ఇదే రాకెట్ ద్వారా పంపి విజయం సాధించారు. అనంతరం 2024 ఆగస్టు 16న ఈవోఎస్-08 ఉపగ్రహ ప్రయోగం చేపట్టారు. ఈ సిరీస్‌లో మొత్తం మూడు ప్రయోగాలు చేపట్టారు. తక్కువ బరువు గల ఉపగ్రహాలను రోదసీలోకి పంపేదుకు ఇస్రో ఎస్‌ఎస్‌ఎల్వీని అందుబాటులోకి తెచ్చింది.



వైసీపీ టీమ్ ట్రిప్‌కు రెడీ!

- అసమ్మతి భయంతో క్యాంప్ రాజకీయాలకు సిద్ధం

తిరుపతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో వైసీపీ క్యాంప్ రాజకీయాలకు తెరలేపింది. సొంత పార్టీ కార్పొరేటర్లే అసమ్మతి స్వరం వినిపిస్తుండడో క్యాంప్‌కు తీసుకెళ్లడం అనివార్యమవుతోంది. గురువారం ఉదయం 8 గంటలకు అందరూ సిద్ధంగా ఉండాలని స్థానిక నాయకత్వంనుంచి ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. తొలుత పాండిచ్చేరికి వెళుతున్నామని కార్పొరేటర్లతో పాటు నాయకులకు లీకులిచ్చారు. వాహనాలు బయలుదేరాక ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసి గోవాలాంటి చోటుకు తీసుకెళ్లాలన్న వ్యూహంలో ఉన్నట్టు సమాచారం. అనంతరం నేరుగా 3న జరిగే ఎన్నికకు హాజరయ్యేలా ప్రణాళిక వేసుకుంటున్నట్టు సమాచారం. కనీసం 25 మందిని తీసుకెళితే ఎక్స్‌అఫిషియో సభ్యులైన ఎంపీ, ఎమ్మెల్సీ రెండు ఓట్లతో డిప్యూటీ మేయర్‌ను కైవసం చేసుకోవచ్చనే ఆలోచనలో ఆ పార్టీ ఉంది. తటస్థంగా ఉన్న వారినీ బలవంతంగా క్యాంపునకు తీసుకెళుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో రహస్య ఓటింగ్ నిర్వహించాలని ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించేందుకు కూటమి నాయకులు సమాయత్తమవుతున్నట్టు తెలుస్తోంది. రహస్య ఓటింగ్ పెడితే గెలుపు అసాధ్యమన్న భావన వైసీపీ శ్రేణుల్లో కనిపిస్తోంది. వాస్తవంగా ఎన్నికల అధికారి సమక్షంలో చేతులెత్తి డిప్యూటీ మేయర్ అభ్యర్థిని ఎన్నుకోవాలి. అయితే క్యాంపు రాజకీయాలు, డబ్బు ఎరగా వేసిన ఘటనలు జరిగితే ఎన్నికల సంఘం తన విచక్షణతో ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే అవకాశం లేకపోలేదు.

ఆర్టీసీలో బదిలీలు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో ఇద్దరి అధికారులను బదిలీ చేస్తూ విజయవాడ ప్రధాన కార్యాలయం పరిపాలన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు డీపీటీవో కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న టి.ఎం.చంద్రయ్య శ్రీకాళహస్తి డిపోకు ఇంచార్జ్ మేనేజర్‌గా నియమించారు. అలాగే మంగళంలో డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉన్న బి.నిర్మలను పీలేరు డిపోకు ఇంచార్జ్ మేనేజర్‌గా నియమించారు.తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని కూడా పేర్కొన్నారు. మంగళం డిపో మేనేజర్ భాస్కర్ అనివార్య కారణాల రీత్యా సుదీర్ఘ సెలవు పెట్టడంతో ఇంచార్జ్ మేనేజర్‌గా టి.బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగించారు.







మృతి చెందిన గణేష్, లక్ష్మీనారాయణ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

పిచ్చాటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం రెప్పాలపట్టు అటవీమార్గంలో తులసికృష్ణాపురం క్రాస్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. శ్రీకాళహస్తి మండలానికి చెందిన గణేష్(25), మిట్టకండ్రిగకు చెందిన చెర్లోపల్లి లక్ష్మీనారాయణ(30) ద్విచక్రవాహనంలో పిచ్చాటూరుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో తులసికృష్ణాపురం క్రాస్ వద్ద వీరి బైక్‌ను కారు ఢీకొంది. సంఘటనా స్థలంలోనే వీరిద్దరూ దుర్మరణం చెందారు. కారు డ్రైవర్ పరారయ్యాడు. సమీపంలోని పశువుల కాపర్లు ప్రమాద విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంకటేశ్వరులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గణేష్‌కు పెళ్లి కాలేదు. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా 'సామంచి' బాధ్యతల స్వీకరణ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సామంచి శ్రీనివాస్ బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు మంత్రి సత్యకుమార్, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి ఆడిటోరియం వరకు సమాంచి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు చేపట్టారు. ఎస్వీయూలో విద్యార్థి నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేసిన సామంచి శ్రీనివాస్.. వామపక్ష భావాలుగల వారితో విబేధించి జైలు జీవితం కూడా గడిపారని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తుచేశారు. ఆయన కృషికి తగిన గౌరవం లభించిందన్నారు. సీనియర్లను గౌరవిస్తూ, కొత్తవారిని కలుపుకుంటూ, కార్యకర్తల కష్టాన్ని గుర్తిస్తూ పనిచేయాలని సూచించారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ సమర్థంగా అధ్యక్ష బాధ్యతలను నెరవేరుస్తారని చంద్రగిరి ఎమ్మెల్యే నాని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, కీలకమైన జిల్లా బాధ్యతలను సామంచికి ఇవ్వడం ఆయన సామర్థ్యానికి గీటురాయి అని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. తాను, సామంచి కలిసి ఎన్నో పోరాటాలు చేశామని, జైలు జీవితం కూడా గడిపామని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్ష బాధ్యతలకు ఆయన న్యాయం చేస్తారన్నారు. 30 సంవత్సరాలుగా తనను ఎందరో పెద్దలు, నాయకులు, కార్యకర్తలు వెన్నుతట్టి ప్రోత్సహించారని, అండదండలు అందించారని సామంచి శ్రీనివాస్ చెప్పారు. వారందరి సహకారంతోనే తాను ఈ స్థానానికి చేరుకోగలిగానన్నారు. ప్రతి ఒక్కరినీ కలుపుకొని పనిచేస్తానని, సీనియర్ నాయకుల సూచనలు, సలహాలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా యూకేకు చెందిన పారిశ్రామికవేత్త బాలకృష్ణారెడ్డి, అబుదాబికి చెందిన శ్రీనివాసరెడ్డి, తిరుపతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గుణకల మురళి తదితరులు సామంచిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జనసేన నేత పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, కల్లపల్లి నరసింహారెడ్డి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, చంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న సామంచి

ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గంజాయి తీసుకెళుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం నిందితులను ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు చూపారు. ఏర్పేడు మండలం మేర్లపాక దళితవాడ బస్టాపు వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లుగా సీఐ జయచంద్రకు సమాచారం వచ్చింది. సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకోగా.. ఐదు కిలోల గంజాయి పట్టుబడింది. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లాకు చందిన నవీన్ కుమార్, వేలూరు జిల్లాకు చెందిన మునస్వామిగా విచారణలో తేలింది. వీరు అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద గంజాయి కొని శ్రీకాళహస్తి, రేణిగుంట రైల్వేస్టేషన్ పరిసరాల్లో విక్రయించేందుకు ఏర్పేడులో సంచరిస్తున్నట్లుగా డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఈ కేసులో ప్రతిభ చూపిన రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించినట్లు తెలిపారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ

ఆక్రమణల బారిన చెరువు పోరంబోకు భూములు


మాచవరంలో ఆక్రమణలో చెరువు భూమి

ఓజిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేస్తున్నా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. మాచవరం, ఇనుగుంట, ఆరిమేనిపాడు, సగుటూరు, కొండవల్లిపాడు, కొత్తచెరువు తదితర గ్రామాల్లో చెరువు పోరంబోకు, ప్రభుత్వ భూములు ఆక్రమణదారుల గుప్పెట్లో ఉన్నాయి. ఆక్రమణల కట్టడికి గ్రామ రెవెన్యూ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడలేదు. ఆక్రమణల భూముల విషయంలో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబందిత అధికారులు సరైన రీతిలో స్పందించాల్సిన అవసరముంది.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత: పాశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక చవటగిరి జనకాలనీలో ఆయన అధికారులతో గ్రామసభ నిర్వహించారు. ప్రజల అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ చవటగిరిజనకాలనీలో తాగునీరు, వీధిదీపాలు, రోడ్లు, డ్రైనేజీకాలువలను అభివృద్ధిపరుస్తామన్నారు. అర్జీలను సత్వరమే అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, పిట్టి నాగరాజు, తహసీల్దారు చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్, వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి : బీజేపీ


గీతాకుమారికి వినతిపత్రమిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గీతాకుమారిని బుధవారం బీజేపీ నాయకులు సత్కరించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, దయాకర్, చావా వాసుదేవరావు, సురేష్‌బాబు, బాలకృష్ణ, శివ పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల కట్టడి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ తిరుపతయ్య, ప్రిన్సిపాల్ రవిప్రసాద్

గూడూరు అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వాహనాలను నడిపే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చునని ఒకటో పట్టణ ఎస్‌ఐ తిరుపతయ్య అన్నారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌లను ధరించి వాహనాలను నడపాలన్నారు. అధికవేగం ప్రమాదకరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయాలి

కోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అల్లంపాడులో భూముల రీసర్వేను బుధవారం తహసీల్దారు జయజయరావు తనిఖీ చేశారు. అల్లంపాడుతోపాటు పలు మజిర గ్రామాల్లో 8 రోజులుగా రీసర్వే జరుగుతోంది. ఈ పంచాయతీలోని 851.30 ఎకరాల భూములను మండల సర్వేయర్ గోపీరెడ్డి ఆధ్వర్యంలో విలేజ్ సర్వేయర్లు, నలుగురు వీఆర్వోలు, రీసర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో తహసీల్దారు జయజయరావు సర్వేను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకొని కొన్ని అక్కడే పరిష్కరించారు.

డీకేటీ భూముల్లో అక్రమ గ్రావెల్ రవాణా అడ్డుకోండి

కోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గూడలి పంచాయతీ ఓటిగుంట డీకేటీ భూముల్లో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఎస్‌ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు నాగేంద్ర కోరారు. ఆయన ఆధ్వర్యంలో గూడలి అరుంధతీయులు డిప్యూటీ తహసీల్దారు అజ్మతుల్లాఖాన్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. సర్వేనంబరు 442లో1బీ, 443లోని 33 ఎకరాల డీకేటీ భూములను 50 ఏళ్లక్రితం తమ పూర్వీకులకు సీలింగ్ కింద రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. ఈ భూములతోపటుల కింద ఉన్న ప్రభుత్వ భూములను కూడా కొద్దికొద్దిగా ఆక్రమించుకుని తామే సాగుచేసుకొని బతుకుతున్నామన్నారు. కొంతమంది అక్రమంగా తమ భూములతోపాటు ప్రభుత్వ భూముల్లో కూడా గ్రావెల్ ఎత్తేసి సొమ్ము చేసుకుంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటా: రామ్‌కుమార్


కార్యకర్తలతో మాట్లాడుతున్న రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరిటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నివాసంలో ఆయన కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో పార్టీ అధినేత జిల్లాల పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. తండ్రిని కోల్పోయిన కౌన్సిలర్ కల్యాణిని, పితృ వియోగంతో బాధపడుతున్న మన్నూరు పాటూరు ప్రసాద్ రెడ్డిలను పరామర్శించారు. వెందోడు కార్తీక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులపై తహసీల్దార్ ఆరా


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పెళ్లకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు, చిల్లకూరు, జీలపాటూరు పాఠశాలలను బుధవారం తహసీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి సందర్శించారు. ఆయా పాఠశాల్లో మౌలిక వసతులు,విద్యార్థుల హాజరవుతున్న పట్టికను పరిశీలించారు. తరగతి గదుల్లో పట్టిక ప్రకారం విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలల హెచ్ఎంలతో పలు విషయాలపై చర్చించారు. ఆయన వెంట వీఆర్వోలు తేజ, వంశీకృష్ణ ఉన్నారు.

ఏపీ హంస క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ-హంస) వార్షిక క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా, నేతలు టాటాబాయి, ఇమ్రాన్, గిరి, శ్రీనివాస్, వెంకటసుబ్బమ్మ, రాజేష్, సురేంద్ర, మైనంపాటి మునిరాజా, పద్మజ, శాంతకుమార్, స్వర్ణలత, గంగమ్మ, జయలక్ష్మి, జ్యోతిలక్ష్మి, ముకేష్, నరేష్ పాల్గొన్నారు.



ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతుకు ఆ ధాన్యం చేతికొస్తే ఆ కళ్లలోని ఆనందం అంతాఇంత కాదు... ఈ ఏడాది తుఫాన్ రైతులకు కొంత పంట నష్టం చేకూర్చినా కొద్దోగొప్పో ధాన్యం చేతికొచ్చాయి. తడ మండలంలో వారం రోజులుగా వరికోతలు మొదలయ్యాయి. దీంతో రహదారులే కళ్లాలుగా మారాయి. చేనిగుంట, తడ, జాతీయ రహదారుల పక్కన ధాన్యంరాశులు గుట్టగా పోసి వాటిని ఆరపెట్టుకోవడం కన్పించింది. -తడ,ఆంధ్రజ్యోతి

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

తగ్గిన దిగుబడులపై వరి రైతుల దిగాలు



వరి పంట కోతలో యంత్రాలు - నూర్పిడి తర్వాత ధాన్యం బస్తాలను లారీలోకి లోడ్‌చేస్తున్న కూలీలు

బాగా నష్టం వస్తుంది



వెదురుపట్టు రోడ్డు పక్కన 13 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. ఎకరానికి 23 బస్తాలు దిగుబడి వచ్చింది. ఇప్పటి రేట్లకు అమ్మితే ఎకరానికి పెట్టుబడి పోను రూ.3350 వేలు వరకు నష్టం వస్తుంది.

- షేక్ మౌలాసాహేబ్, వేణుంబాక

అకాల వర్షంతో నిరాశ



మూడెకరాల్లో కెఎన్ఎం రకం వేశాను. 66 బస్తాల దిగుబడి వచ్చింది. ఇంత దారుణంగా దిగుబడి రావడం ఇదే మొదట సారీ. ఎల్లిన సాగు చేయడంతో దిగుబడులు రాలేదు. ఈనెల 18న పడిన వర్షం వల్ల దిగుబడి తగ్గిపోయింది.

- కర్పూరం రాజేష్, నెలబల్లి

దొరవారిసత్రం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజుల నుంచి వరి కోతలు, నూర్పిడిలు మొదలయ్యాయి. అక్కరపాక, నేలపట్టు, మైలాంగం, పడమట్టికండ్రిగ, శ్రీధనమల్లి, కల్లూరు గ్రామాల్లో ఇప్పటికే కోతలు పూర్తయ్యాయి. వ్యవసాయ అధికారుల అంచనాల ప్రకారం 6,240 హెక్టార్లలో వరి సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురవడంతో అంచనాకు మించి 8 వేల హెక్టార్లలో సాగు చేసినట్లు భావిస్తున్నారు. అయితే ఈ యేడాది దిగుబడి తగ్గడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.. ఎకరానికి 20-25 బస్తాలకు మించి దిగుబడిరావడంలేదు. ఎక్కువమంది కెఎన్ఎం(1638) రకాన్ని సాగుచేశారు. కొందరు బీపీటీ-5204 సాగు చేశారు. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో ఎల్ది, నారుమడి పద్ధతుల్లో నాట్లు వేశారు. జనవరిలో కంకి దశకు చేరుకుంది. అదే సమయంలో వర్షాలు కురవడంతో దిగుబడి తగ్గిందని అధికారులు చెబుతున్నారు. దిగుబడులు తగ్గడంతో కౌలు రైతు పరిస్థితి దారుణంగా ఉంది. ఎకరం సాగుకు సుమారు రూ.30వేలు పెట్టుబడి అవసరం. ఇప్పుడు సగటున 25 బస్తాలు దిగుబడి వస్తే మిగిలేదేమీ ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కోతలు ప్రారంభమై వారం గడిచినా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల జాడలేదు. దళారులు వచ్చి బస్తా(75 కిలోలు) బీపీటీ(5204), కెఎన్ఎం(1638) రకాలకు రూ.1450-రూ.1600 ఇస్తున్నారు.

పెట్టుబడికి సరిపోయింది



ఎకరం పొలంలో కెఎన్ఎం రకం వేశాను. పంట నేల కొరగడంతో గింజ రాలిపోయింది. ఎకరానికి 19 బస్తాలు వచ్చాయి. పెట్టుబడికి సరిపోయింది. నాలుగు నెలల కష్టం కూడ రాలేదు.

- పాకాల నాగులయ్య, నెలబల్లి

పూరిల్లు దగ్ధం

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్‌లో బుధవారం ఓ పూరిల్లు దగ్ధమైంది. అగ్నిమాపకశాఖ అధికారి విజయ్ కుమార్ వివరాల మేరకు... స్థానిక రమణయ్య అనే వ్యక్తి చెందిన పూరింటిపై టపాసుల నిప్పురవ్వ పడి ప్రమాదం జరిగిది. మంటలను అదుపుచేశామన్నారు. లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లిందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నాయుడుపేట టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పండ్లూరు సమీపంలో బుధవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనాస్థలికి చేరుకున్న అర్బన్ సీఐ బాబి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు మతిస్థిమితం లేకుండా గత మూడు రోజులుగా సంచరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాజన టీచర్స్ అసోసియేషన్ డైరీల ఆవిష్కరణ

దక్కిలి, జనవరి 29 : (ఆంధ్రజ్యోతి): మహాజన టీచర్స్ అసోసియేషన్ ఏర్పడటం సంతోషంగా ఉందని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. అసోసియేషన్ ముద్రించిన క్యాలెండర్లు, డైరీలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందా కృష్ణమాదిగ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జగదీష్ బాబు, ఉపాధ్యాయ యూనియన్ నాయకులు చేవూరు మస్తాన్, రాపూరు వెంకటయ్య, దూడల పెంచలయ్య తదితరులు ఉన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామికి కుంభాభిషేకం


గోపూజ నిర్వహిస్తున్న గ్రామపెద్దలు

తడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : త్రై అమావాస్య సందర్భంగా చిన్నమాంబట్టులోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివార్లకు కుంభాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం గోపూజ జరిగింది. కార్యక్రమాలకు ఉభయదాతలుగా సుబ్బనరసయ్య-మధురిమ దంపతులు వ్యవహరించారు. తిరుపతి సిమ్స్ వైద్యుడు కారణి మునస్వామి,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

వెంకటగిరిటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో స్థానిక హనుమంతు రాయి గుండ వద్ద త్రైఅమావస్య సందర్భంగా భక్తులకు అనదానం బుధవారం చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీపీ ప్రకృతికుమార్ హాజరయ్యారు. యువసైన్యం ప్రతినిధులు మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గోపీనాథ్, ఫణీంద్ర, శ్యాం, మురళి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల అవగాహన

నాయుడుపేట టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై నాయుడుపేట అర్బన్ సీఐ బాబీ అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా బుధవారం సాయంత్రం పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాల చోదకులు అనుసరించాల్సిన నిబంధలను వివరించారు. వాహనాలను మితీమీరిన వేగంతో నడపరాదన్నారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

గిన్నిస్‌రికార్డుకెక్కిన వసంతలక్ష్మికి సత్కారం


రామకృష్ణతో కలిసి గిన్నిస్ పత్రాన్ని చూపుతున్న వసంతలక్ష్మి

వెంకటగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నిత్య యోగ సాధనతో జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. యోగాలో ప్రతిభ కనబరిచి ఇటీవల గిన్నిస్ రికార్డు సాధించిన వెంకటగిరి మహిళ చింతగింజల వసంతలక్ష్మిని బుధవారం ఆయన తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో వసంతలక్ష్మికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో మాట్లాడే అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, పార్టీ నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు తదితరులు ఉన్నారు.

వేసవి అవసరాలకు అనుగుణంగా ఉపాధి పనులు


క్షేత్ర సహాయకులతో మాట్లాడుతున్న వరప్రసాద్

కోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అవసరాలకు అనుగుణంగా పనులు గుర్తించాలని ఉపాధిహామి పథకం ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం క్షేత్ర సహాయకులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో పశువుల నీటిగుంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీవో పూర్ణిమ, టెక్నికల్ అసిస్టెంట్‌లు శాంతి, చంద్రశేఖర్, పరుశురాం, సునీత, తదితరులు ఉన్నారు.

పేట రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాట్ల పరిశీలన


లిఫ్ట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సురేంద్ర తదితరులు

నాయుడుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటుపై సదరన్ రైల్వే కమిటీ సభ్యుడు చిగురాకుల సురేంద్ర బుధవారం పరిశీలించారు. స్టేషన్లో ఇందుకు అనుగుణంగా ఉన్న ప్రదేశాన్ని చూశారు. పరిసర ప్రాంతాలతో పాటు మేనకూరు సెజ్‌లోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగుల రాకపోకల వల్ల నాయుడుపేట రైల్వే స్టేషన్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో ఇక్కడి స్టేషన్‌లో లిఫ్ట్‌ను ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. ఈక్రమంలో తాగునీరు, మరుగుదొడ్ల వసతులతో పాటు ప్లాట్‌ఫాం చివరి ర్యాంప్ వరకు రాకపోకల సదుపాయం ఏర్పాటు చేయాల్సి ఉందని సురేంద్ర చెప్పారు.

ఆయుర్వేద వైద్యానికి రూ.86 కోట్లు

● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్


మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి (వైద్యం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలను అందించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో రూ.86 కోట్ల నిధులను మంజూరు చేసిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతి రూరల్ పరిధిలోని అవిలాలలో నూతనంగా నిర్మించిన సమత ఆయుర్వేద ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం మనకు పూర్వీకులు ఇచ్చిన వరమన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఆయుర్వేద వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో ఆయుష్ శాఖకు కేవలం రూ.33 కోట్లు మాత్రమే విడుదల చేసిందని వెల్లడించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఆస్పత్రిలో కేవలం పట్టణ ప్రాంత వాసులకే కాకుండా గ్రామీణులకు కూడా సేవలు అందించాలని ఆస్పత్రి నిర్వాహకురాలు సమత ప్రకాష్‌కు సూచించారు. ఆయుర్వేద గార్డెన్ అభివృద్ధికి సహకారాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. విశ్వధర్మపీఠం అధ్యక్షుడు సోంప్రకాష్, మాజీ మంత్రి పరసారత్నం, సామంచి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంచాయతీల మౌలిక వసతులపై దృష్టి పెట్టండి

ఓజిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో మౌలిక వసతులు, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కోరారు. బుధవారం ఆమె పంచాయతీల కార్యదర్శులతో మాట్లాడారు. అభివృద్ధి ప్రణాళికలతో పాటు మౌలిక వసతుల కల్పించాలన్నారు. నిధుల లభ్యతను బట్టి తాగునీరు, విద్యుత్‌లైట్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. పంచాయతీల్లో నిధులు సద్వినియోగమయ్యేలా చూసుకోవాలని సూచించారు.

నకిలీ ఎరువులను నియంత్రించాలని ధర్నా

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఎరువులు, విత్తనాల విక్రయాలను అధికారులు నియంత్రించి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీ, సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాల వలన రైతులు నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు పూల చంద్రశేఖర్, వేమయ్య, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు, సీపీఐ నాయకులు ప్రభాకర్, కాలేషా, శశికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

గూడూరు అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక సాయివిద్యానికేతన్ పాఠశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో దేశభక్తి, దేశనాయకులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రణయ్, ప్రవీణ్, కిరణ్, నవీన్ పాల్గొన్నారు.

అమావాస్య పూజలు

నాయుడుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) చలివేంద్ర వద్ద వైద్య వీరరాఘవులస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అభిషేకాలు, అష్టోత్తరపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వైద్యసేవల పరిశీలన

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని ఆరోగ్యఉపకేంద్రంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాసులు వైద్యసేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు. విషజ్వరాలు సోకకుండా అవగాహన పెంచాలన్నారు. డాక్టర్ జ్యోతి, నాగేంద్ర కుమార్, నరేష్‌బాబు, ప్రకాష్, మస్తానయ్య, హైమావతి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

వాకాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పంచాయతీ పల్లెపాళెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పాకం చెంగయ్య అనే వ్యక్తిని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం అరెస్ట్ చేశారు. చెంగయ్య నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద హెచ్చరిక బోర్డులున్నా నిలిపి ఉన్న వాహనాలు



చెంగాళమ్మ ఆలయం వద్ద హెచ్చరిక బోర్డు వద్ద పార్కింగ్

అడిగేవారు లేరని ఆపేస్తున్నారు..

సూళ్లూరుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పరిశ్రమలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు ఎక్కడపడితే అక్కడ రోడ్డుకు అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. పోలీసులు వాహనాలు నిలపరాదని బోర్డులు పెట్టినా వాహన యజమానులు లెక్కచేయడం లేదు. ముఖ్యంగా ఆర్డీవో కార్యాలయం వెళ్లే మార్గంతో పాటు కార్యాలయ ముందు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలిపివేసి వెళ్తున్నారు. చీకటిపడితే ఆ బస్సుల వద్ద మందుబాబుల ఆగడాలు శ్రుతి మించుతున్నాయి. మహిళలు, విద్యార్థినులు ఆమార్గంలో వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. చెంగాళమ్మ వద్ద రోడ్డు ఇరువైపులా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పార్కింగ్‌లా వినియోగించుకొంటున్నారు. ఎక్కడ పడితే అక్కడ బస్సులు నిలిపివేసి వెళ్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. పలు సందర్భాల్లో ఎదురుగా ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించలేక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో, రహదారుల వద్ద ఆపేస్తున్న వాహనాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

ఈవీఎం గోదాము తనిఖీ


రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్

రేణిగుంట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తనిఖీ చేశారు. ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరిచే గోదాము షట్టర్లకు వేసిన సీల్‌ను , సీసీ కెమెరాలను పరిశీలించారు. భద్రతా సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో జీఎస్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్, నోడల్ అధికారి సుధారాణి, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రసాద్, తహసీల్దారు సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వంటమాస్టర్‌పై చర్యలు తీసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గురుకుల పాఠశాలలో వంట మాస్టర్‌గా పని చేస్తున్న చెంగల్రాయుడుపై చర్యలు తీసుకోవాలని గురుకుల పాఠశాల కమిటీ సభ్యులు బుధవారం ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చెర్‌పర్సన్ భావన, వైస్ చైర్మన్ అర్జునయ్య మాట్లాడుతూ... చెంగల్రాయుడు ప్రతి రోజు మద్యం తాగి విధులకు హాజరై ఇష్టానుసారంగా వంట చేస్తున్నాడని పిల్లలు అడిగితే వారిని బెదిరిస్తున్నాడని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు అడిగినా వారిపై విరుచుకుపడుతున్నాడన్నారు. సెక్యూరిటీ విజయమ్మ ఎందుకు అలా మాట్లాడుతున్నావని అడిగితే ఆమెను కూడా బూతులు తిడుతున్నారని తెలిపారు. తక్షణం చెంగల్రాయుడిని విధులనుంచి తప్పించాలని లేదా వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని కోరారు. దీనిపై ప్రిన్సిపాల్ స్పందిస్తూ... విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు.

పుత్తూరు వార్తలు

అనుభవంలో పేద గిరిజనులు... రికార్డుల్లో వేరే పేరు!


మామిడి తోట వద్ద సర్వే నిర్వహిస్తున్న సర్వేయర్

పుత్తూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలకృష్ణాపురం యానాది కాలనీలో క్షేత్రస్థాయి పరిశీలించకుండా రెవెన్యూ అధికారులు చేసిన అవకతవకల కారణంగా గిరిజనులకు మరో వ్యక్తి మధ్య ఘర్షణకు దారి తీసింది. తహసీల్దారు ఆదేశం మేరకు మండల సర్వేయరు శేషమరాజు బుధవారం క్షేత్రస్థాయిలో సర్వే చేశారు. 1972లో తొరూరు రెవెన్యూ గ్రామ పరిధిలో 600 ఎకరాలను సీజేఎఫ్ఎస్(కామన్ జాయింట్ ఫార్మింగ్ స్కీం) కింద గిరిజనులకు పంపిణీ చేసి గోపాల కృష్ణాపురం గిరిజనకాలనీని ఏర్పాటు చేసింది. పట్టాలు పొందిన రామయ్య, చెంగమ్మ, సుబ్బయ్య, కాంతారావు, నాగభూషణం మామిడి చెట్లను పెంచుతున్నారు. వారికి కేటాయించిన భూమి పక్కన రెండెకరాల ప్రభుత్వ భూమిని కూడా కలుపుకుని మామిడి చెట్లను పెట్టారు. ముప్పై ఏళ్లుగా ఫలసాయం పొందుతున్నారు. ఈ భూములకు హక్కులు కల్పించాల్సిందిగా పలుమార్లు రెవెన్యూ అధికారులను కోరారు. సదరు భూమి పుత్తూరుకు చెందిన కదిరివేలు పేరు మీద ప్రభుత్వ రికా ర్డుల్లో నమోదైంది. ప్రస్తుతం ఈ భూమిని నేస నూరుకు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేశారు. విషయం తెలుసు కున్న గిరిజనులు ఎస్సీ, ఎస్టీ జిల్లా సంఘ కార్యదర్శి నందయ్య ద్వారా తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, తనకు తెలిసినంత వరకు గిరిజనులే ఆ భూములను సాగు చేసుకుం టున్నారని ఎంసీటీసీ సభ్యుడు బత్తయ్య చెప్పారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

సర్వేలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ జిల్లా సంఘ కార్యదర్శి నందయ్య మాట్లాడుతూ... పేద గిరిజనులు కష్టపడి పెంచిన ముప్పై ఏళ్ల మామిడి తోటను కదిరివేలుకు ఎలా రికార్డు చేశారని ప్రశ్నించారు. తప్పుడు రికార్డులు చేసిన విషయమై విచారణ జరిపి బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

పాడిరైతులకు ఉపయోగకరంగా పశు ఆరోగ్య శిబిరాలు

వడమాలపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ఉపయోగకరంగా ప్రభుత్వం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు ఆరోగ్య శిబిరాల పరిశీలన అధికారి రజనీకుమారి చెప్పారు. బుధవారం మండలంలోని కదిరిమంగళంలో నిర్వహిస్తున్న శిబిరాన్ని ఆమె పరిశీలించారు. జిల్లా పశుసంవర్ధక అధికారి రవికుమార్, ఉపసంచాలకురాలు ఉమామహేశ్వరి, సహాయ సంచాలకుడు గురునాథ్, వైద్యాధికారులు చంద్రకళ, చిరంజీవి, యశోద, లోకనాథం పాల్గొన్నారు.

పింఛన్ లబ్ధిదారుల అర్హత గుర్తింపు

వడమాలపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా ఫించన్ లబ్ధిదారుల అర్హత గుర్తింపు కోసం క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి విచారణ నిర్వహించారు. మండలంలో 34 మంది రూ.15 వేలు చొప్పున ఆరోగ్య పింఛన్లు పొందుతున్నారు. దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళ, బుధవారాల్లో ప్రత్యేక బృందం ప్రత్యక్షంగా పరిశీలించింది. డాక్టర్ రవిబాబు, సునీల్‌బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రపాణి, వెలుగు ఏపీఎం మునికృష్ణారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రమోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించండి


వినతిపత్రం ఇస్తున్న వీధి విక్రయదారులు

పుత్తూరు టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధి విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, గౌరవాధ్యక్షుడు మహేష్ మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడకు వినతిపత్రం అందజేశారు. గుర్తింపుకార్డులు ఇవ్వాలని, లైసెన్స్‌లు మంజూరు చేయాలని, టౌన్ వెండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీధి విక్రయదారుల సంఘం పట్టణ అధ్యక్షుడు నజీర్, కార్యదర్శి నవీన్, నాయకులు చాంద్ బాషా, కాశీరాం, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పుత్తూరు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ సురేంద్రనాయుడు స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఓవర్ లోడ్, నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనం నడిపే వారు తప్పనిసరిగా లైసెన్స్, వాహన రికార్డులు తమ వెంట ఉంచుకోవాలన్నారు. బైక్ చోరీల నేపథ్యంలో వాహనాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పింఛన్ లబ్ధిదారులకు వైద్య పరీక్షలు

సత్యవేడు జనవరి 29(ఆంధ్రజ్యోతి): బోగస్ పింఛన్ల ఏరివేతలో భాగంగా పెరాలసిస్, డయాలసిస్ బాధితులకు సంబంధించి లబ్ధిదారులను వైద్య సిబ్బంది పరీక్షిస్తున్నారు. నెల్లూరు ప్రభుత్వాస్పత్రి వైద్యుల వెంకట హరిప్రసాద్, చిన్నపాండూరు పీహెచ్‌సీ డాక్టర్ లావణ్య, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్, సిబ్బంది మండలంలోని కన్నవరం, రాజగోపాలపురం, ఇరుగుళం, మదనంబేడు, పెద్దఈటిపాకం, సత్యవేడు 1, దాసుకుప్పంలో పర్యటించి 14 మందిని పరీక్షించారు.

రేణిగుంటలో చోరీ



రేణిగుంట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని గణేష్‌నగర్‌లో చోరీ జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గణేష్‌నగర్‌కు చెందిన భానుప్రసాద్ రైల్వేలో కాంట్రాక్ట్ ఉద్యోగి.ఇటీవల కుటుంబీకులతో కలసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. తలుపులు పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూశాడు. బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 31 గ్రాముల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి చోరీ జరిగినట్టు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ అరుణ్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రాస్ వయోవృద్ధుల కేంద్రం తనిఖీ

రేణిగుంట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలోని వయోవృద్ధుల కేంద్రాన్ని రాష్ట్ర దివ్యాంగులు మరియు వయోవృద్ధులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సూర్యకుమారి తనిఖీ చేశారు. తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా కేంద్రంలోని ప్రతిభావంతుల ఆశ్రమాన్ని ఆమె పరిశీలించారు. అక్కడి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఆమె వెంట సహాయ సంచాలకుడు శ్రీనివాస్, రాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ యువరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

శ్మశాన వాటికకు దారి వసతి కల్పించండి

పిచ్చాటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిక దారి సమస్య పరిష్కరించాలని గోవర్ధనగిరి దళితవాడవాసులు తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి చేశారు. దశాబ్దాల శ్మశానం బాటను గుడిమాన్యంగా సర్పంచ్ శివ రామకృష్ణమనాయుడు అడ్డుకున్నారన్నారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించి, సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు.

ప్రమాదకరంగా కల్వర్టు


అసంపూర్తిగా ఉన్న కల్వర్టు

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నిర్మాణ దశలో ఉన్న కల్వర్టు ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. తొట్టంబేడు మండలం పొయ్య కొత్తూరు సమీపంలో జాతీయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన కల్వర్టు పనులు కొనసాగుతున్నాయి. అయితే కల్వర్టు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బుధవారం ఉదయం పొయ్య గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్ర వాహనంతో అటువైపుగా వెళుతూ అదుపు తప్పాడు. దీంతో వాహనం కల్వర్టు పక్కన ఉన్న నీటిగుంతలో పడింది. స్థానికులు స్పందించి ద్విచక్ర వాహనాన్ని ఒడ్డుకు చేర్చారు. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు వద్ద రాకపోకలను నియంత్రించేలా బ్యారీకేడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రేన్ ఢీకొని భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కూలి పనులు చేసుకుని రోడ్డు పక్కన నడచి వెళ్తున్న భవన నిర్మాణ కార్మికుడిని క్రేన్ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. బుధవారం రాత్రి జింగిలిపాళెం వద్ద పంగూరు రహదారిపై జరిగింది. జింగిలిపాళెం దళితవాడకు చెందిన వెంకటేష్(40) భవన నిర్మాణ కార్మికుడు. ఊరందూరులో పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. జింగిలిపాళెం వద్ద నడచివెళుతుండగా క్రేన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈవ్‌టీజింగ్‌పై ఉక్కుపాదం

● కళాశాల వద్ద పోలీసుల గస్తీ


కళాశాల వద్ద వాహన తనిఖీల్లో పోలీసులు

రేణిగుంట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఈవ్‌టీజింగ్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆ మేరకు బుధవారం కేఎల్ఎం ఆస్పత్రి కూడలిలోని కళాశాల ముందు గస్తీ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో చర్యలు చేపట్టారు. కళాశాలకు విద్యార్థులు వెళ్లే సమయంలో, వదిలే సమయంలో రెండు సార్లు ఈ గస్తీ నిర్వహించారు. అలాగే ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేశారు.

పాడిరైతుల అభివృద్ధికి కృషి

సత్యవేడు, జనవరి 29: పాడిరైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. మండలంలోని వీఆర్‌కండ్రిగలో నిర్మించిన గోకులం షెడ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం అనుబంధ రంగమైన పాడి పరిశ్రమను అభివృద్ధిలోకి తీసుకురావడానికే గోకులం షెడ్లను మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను కూడా ప్రారంభించారు. సర్పంచు సుజాత, మాజీ ఎంపీపీ మస్తాన్, నాయకులు పరమశివం, చిన్న, లోకయ్యరెడ్డి, శివానందం, పీఎస్‌రాజు, వెంకటరమణ, హేమభూషణం, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంఈవో రవి, ఏపీవో లోకమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

నారాయణవనం, జనవరి 29(ఆంధ్ర జ్యోతి): సిమెంట్ రోడ్డు నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని అరణ్యంకండ్రిగలో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు భాస్కరన్, శ్రీనివాసులు, బాలచందర్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, వెంకటేష్ ఉన్నారు.

మద్యం దుకాణాలకు ఈడిగ కులస్థులు దరఖాస్తు చేసుకోండి

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఎక్సైజ్ శాఖ డివిజన్ పరిధిలో కల్లు గీత కార్మికులకు నాలుగు మద్యం దుకాణాలు మంజూరైనట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. ఆ నాలుగు దుకాణాలను ఈడిగ కులస్థులకు కేటాయించామన్నారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం, తొట్టంబేడు, కేవీబీపురం, శ్రీకాళహస్తి రూరల్‌లో ఒక్కో దుకాణం చొప్పున కేటాయించినట్లు తెలిపారు. ఈడిగ కులస్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వతేదీ లోపు ఆన్‌లైన్‌లో కానీ ఎక్సైజ్ కార్యాలయంలో కానీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.2లక్షలు దరావతు చెల్లిస్తే దరఖాస్తు డౌన్‌లోడ్ అవుతుందన్నారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారి కులధృవీకరణ పత్రాన్ని నిర్ధారణ చేస్తామన్నారు. తప్పుడు పత్రాలు సమర్పిస్తే క్రిమినల్ చర్యలు ఎదుర్కోవల్సి వస్తుందని హెచ్చరించారు. వివరాలకు శ్రీకాళహస్తి ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఎక్సైజ్ సీఐ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల పాఠశాలకు ఐసాన్ పరిశ్రమ చేయూత


విద్యార్థినులతో పరిశ్రమ నిర్వాహకులు

సత్యవేడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శ్రీసిటీలోని ఐసాన్ ఆటో పార్ట్స్ ఇండియా పరిశ్రమ సత్యవేడు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.30లక్షలతో సమావేశ మందిరం, వంట గది మరమ్మతులు, పైకప్పు నిర్మాణం, క్రీడా మైదానం అభివృద్ధి, పాఠశాల ఆవరణ చుట్టూ మొక్కలు పెంచేందుకు పైప్‌లైన్, కొళాయిలు ఏర్పాటు చేసింది. వీటిని ఐసాన్ ఎండీ యసనోరి సకావే, శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసాన్ ఎండీ యసనోరి సకావే మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ తరహా మరిన్ని విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతామని చెప్పారు.

ఇంటి స్థలాలిచ్చే వరకు పోరాటం: సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న మురళి

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణంకోసం రూ.5లక్షలు ఇవ్వడంతో పాటు నిర్మాణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. అదే విధంగా మహిళలకు నెలకు రూ.1,500, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం వంటి హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జె.గురవయ్య, తులసీరాజన్, గోపి, ధర్మయ్య, ఎం.శివకుమార్, చారులత, మణి, శీను, చందు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సిపాయి ఆధ్వర్యంలో అన్నదానం

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ కూడలి వద్ద బుధ వారం ఎమ్మెల్సీ, రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే మధు వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, కంఠా ఉదయ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సుభాష్ పాలేకర్



శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ప్రకృతి వ్యవసాయవేత్త సుభాష్ పాలేకర్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

●జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తన జన్మదినాన్ని పురస్కరించుకుని దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం తాగితే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. వాకర్స్, విద్యార్థులు, అధ్యాపకులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 2వ పట్టణ సీఐ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు అన్నారు. మత్తేరిమిట్ట పంచాయతీ సిద్దమ అగ్రహారం పరిధిలో స్వచ్ఛతా దివస్‌లో భాగంగా ప్రాథమిక పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేయించారు. మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): క్రీడా మైదానంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని అర్బన్ సీఐ శరత్‌చంద్ర హెచ్చరించారు. ఎస్ఐ అరుణ్‌కుమార్, కానిస్టేబుళ్లతో వేణుగోపాలపురం మైదానాన్ని పంచాయతీ సిబ్బంది సహకారంతో శుభ్ర చేయించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ఘనంగా సిపాయి సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు

తిరుపతి(వైద్యం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం జన్మదిన వేడుకలను రష్ ఆస్పత్రి ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దగ్గుమాటి శ్రీహరిరావు ఆస్పత్రి ముందు 200 మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సిపాయి మౌనరెడ్డి, మేనేజరు మహేష్, సిబ్బంది రోజా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న డాక్టర్ శ్రీహరిరావు - కేక్ కట్ చేస్తున్న రష్ ఆస్పత్రి సిబ్బంది

పురపాలక సంఘ ప్రత్యేక అధికారి కొనసాగింపు

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపల్ ప్రత్యేక అధికారిని మరో ఆరు నెలలు కొనసాగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకపోవడంతో ఆర్డీవోను ప్రత్యేక అధికారిగా గత మూడేళ్ల నుంచి కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 18న ప్రత్యేక అధికారి కాలపరిమితి ముగిసింది. దీంతో బుధవారం మరో ఆరు నెలల పాటు ప్రస్తుత ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డిని ప్రత్యేక అధికారిగా కొనసాగిస్తూ జీవో జారీ అయ్యింది.

రేణిగుంట రైల్వేస్టేషన్ తనిఖీ

రేణిగుంట, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : రేణిగుంట రైల్వేస్టేషన్‌ను బుధవారం గుంతకల్లు ఇన్‌చార్జి డీఆర్ఎం రామకృష్ణ తనిఖీ చేశారు. సికింద్రాబాద్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఈనెల 31న శుక్రవారం పర్యటించనున్న నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయన రన్నింగ్ రూంను పరిశీలించారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్ పరిశీలన నిమిత్తం బయలుదేరి వెళ్లారు. స్టేషన్‌మాస్టర్ శేషగిరినాథ రెడ్డి, గుంతకల్లు డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో కొలువై ఉన్న అంకాలమ్మ ఆలయం వద్ద బుధవారం అమావాస్యను పురస్కరించుకుని అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ... మూడు సంవత్సరాలుగా ప్రతి అమావాస్యకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. గోవర్ధన రావు, యశ్వంత్‌రావు, క్రాంతికుమార్, శివకుమార్ రెడ్డి, డాక్టర్ కృపానిధి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన జనసైనికులు



వరదయ్యపాళెం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండల జనసేన నాయకులు బుధవారం సత్యవేడు కోర్టుకు హాజరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వంలో 8మంది జనసేన నాయకులపై కేసులు నమోదయ్యాయి.

నష్టపరిహారం ఇప్పించండి

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తమకు నష్టపరిహారం ఇప్పించాలని శ్రీకాళహస్తి మండలం వాంపల్లి రైతులు బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుతను కలిసి విన్నవించారు. అపాచీ పరిశ్రమ కోసం తాము భూములు ఇచ్చామని 20 మంది రైతులు చెప్పారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని వినుత వారికి హామీ ఇచ్చారు.

నువ్వుల పంటపై అవగాహన

కేవీబీపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపేడు, వగత్తూరుల్లోని రైతులకు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నువ్వుల పంటపై అవగాహన కల్పించారు. 80, 85 రోజుల్లో దిగుబడి వచ్చి, బూజు, ఆకుపచ్చ తెగుళ్లు ఉంటే తట్టుకుని ఎకరాకు సుమారు 4 క్వింటాళ్లకు పైగా దిగుబడి ఇచ్చే యలమంచి 66, 146 రకాల విత్తనాలను పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు దివ్య, అనూష, ప్రియాంక, జిల్లా రైతు సంఘ నాయకులు జనార్దన్ పాల్గొన్నారు.